ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 10, 2016

ఆకాశంలో హైజంప్..

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

కొత్త ఊపిరి

పాప్ తారంగేట్రం

సరిగ్గా 20 ఏళ్ల క్రితం బాలీవుడ్ సినీ నృత్యగీతికలకు పోటీగా ప్రైవేట్ పాప్ ఆల్బమ్స్ క్రేజ్ ఉండేది. 90వ దశకం ఇండీ పాప్ శకం. ప్రతి ఇంట్లో హిందీ పాటలనగాననే ఫాల్గుణి పాఠక్, సోను నిగమ్, దలేర్ మెహ్నందీ, పంకజ్ ఉద్దాస్, అలీషా చినాయ్, రాగేశ్వరి, లక్కీ అలీ, షాన్, బాబా సెహెగల్, సునీతా రావ్, శ్వేతా షెట్టి వంటి పాప్ స్టార్ల క్యాసెట్లు వేసేవారు. 90వ దశకంలో హోరెత్తిన ఈ ప్రైవేట్ ఆల్బమ్స్ నుంచి చాలా మంది బాలీవుడ్ హీరోయిన్లు పరిచయమయ్యారు. వారిలో ఇప్పుడు సూపర్‌స్టార్‌లుగా మారిన వారు కూడా ఉన్నారు. 'మేరి చూనర్ ఉడు ఉడు జాయే.., యాద్ పియా కీ ఆనే లగీ... గీతాల ద్వారా ఆయేషా టాకియా, రియాసేన్‌లు పరిచయమయ్యారు. ఆయేషా నటించిన మేరీ చూనర్ పాటలోనే త్రిష కూడా తళుక్కుమంటుంది. మిస్ ఏషియా పసిఫిక్ దియామిర్జా అభినయంలో తొలి అడుగులేసింది 'న మర్‌తె హమ్..' మ్యూజిక్ ఆల్బమ్‌తోనే! చిరునవ్వుతో ఆకట్టుకునే షాహిద్‌కపూర్, కండల వీరుడు జాన్ అబ్రహామ్ తొలుత కనిపించింది మ్యూజిక్ ఆల్బమ్స్‌లోనే. బాలీవుడ్ అగ్రనటి దీపిక పదుకొన్ కూడా హిమేష్ రెషమ్మియా 'ఆప్‌కా సరూర్..'లో నటించింది.. నర్తించింది. మేటి తారలు విద్యాబాలన్ 'కభి ఆనా తు మేరీ గలి..', ప్రియాంక చోప్రా 'సాజన్ మేరీ సత్ రంగియా..', బిపాషా బసు 'తు కబ్ జానేగి..' ఆల్బమ్ సాంగ్స్ ద్వారా అందరి కళ్లలో పడ్డారు. రామ్ గోపాల్ వర్మ 'రోడ్' సినిమాలో నటించిన కొయినా మిత్రా, పాపులర్ స్టార్ మల్లికా షరావత్, ముద్దుగుమ్మలు అమృతా రావ్, రియా సేన్, సమీరా రెడ్డి 90'ల ఆల్బమ్ సాంగ్స్‌తో తెరంగేట్రం చేసిన వారే!

దియా మీర్జా

సెలినా జైట్లీ

రియా సేన్

అమృత రావ్



జాన్ అబ్రహం

సమీరా రెడ్డి

కొంకణ్ స్వేచ్ఛా స్వరం



లిబియా లోబో గోవా అండర్‌గ్రౌండ్ వాయిస్. దేశ స్వతంత్ర పోరాటంలో ఓ అన్‌సంగ్ హీరో. స్వాతంత్ర్య పోరాటంలో వినిపించని పేర్లెన్నో... కనిపించని కథలెన్నో. అలాంటి పేర్లలో, కథల్లో గోవా లిబరేషన్ కాలంలో అక్కడి పరిస్థితి సమాచారాన్ని ప్రపంచానికి చేరవేసిన లిబియాది ఒకటి. గోవా లిబరేషన్ తర్వాత దాదాపు 50 ఏళ్ల తర్వాత నోరు కదిపిన లిబియా రేడియో ద్వారా ఎలా సహచరుడు వమన్ సర్దేశాయ్‌తో కలిసి గోవా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిందో వివరించారు. ఉద్యమ కాలంలో రేడియో సేవల్ని అందించిన ఆమె దాని బేస్ స్టేషన్ గుట్టు తెలీకుండా అతి రహస్యంగా నడిపారు. పోర్చుగీస్‌లో 'వోజ్ డి లిబర్దేడ్', కొంకణిలో 'సాద్వోనెచో ఆవాజ్', ఇంగ్లీష్‌లో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' పేరిట రేడియో ప్రసారాల్ని అందించారు.

గోవాను ఆనుకుని ఉన్న అంబోలి అడవుల్లో బేస్ మార్చుకుంటూ రేడియో ప్రసారాల్ని నిర్వహిస్తూ బయటి ప్రపంచానికి అక్కడి తాజా పరిస్థితుల్ని, పరిణామాల్ని ఎప్పటికప్పుడు చేరవేయడం ఓ సాహసం. ఉద్యమం కీలక దశకు చేరుకునే సమయానికి ఆమె అప్పటి బొంబేలో ఉండేవారు. కానీ ఆమె హృదయం గోవా కోసం మథనపడేది. నిర్బంధంలో ఉన్న గోవాలో ఏం జరుగుతుందో.. అక్కడి ఉద్యమకారుల పరిస్థితి ఏమిటో బయటి ప్రపంచానికి తెలీడం లేదు. అలాగే గోవాలోకి ఎటువంటి దినపత్రికలు, వార్తలు చేరకుండా అడ్డుకుంది కాలనీ సైన్యం. సమాచారం అందే ప్రతి అవకాశాన్ని నాశనం చేసేసింది. పోర్చుగీసు పాలనకు వ్యతిరేకంగా ఏమీ చేయకూడదు, ఏ విషయం పబ్లిష్ అవకూడదంటూ కఠిన సెన్సార్‌షిప్ అమలవుతోంది. అంతకు ముందు ఏడాది దాద్రా మరియు నాగర్ హవేలీ విమోచనోద్యమం సందర్భంగా అందిన రెండు వైర్‌లెస్ సెట్ల విషయం లోబోకు తెలిసింది. వాటిని రేడియో ట్రాన్స్‌మిట్టర్లుగా వినియోగించి గోవాలో రేడియో ప్రసారాలు చేయాలని ఆమె, సహ ఉద్యమకారుడు ఆలిండియా రేడియో ఉద్యోగి అయిన వమన్ సర్దేశాయి ప్రయత్నాలు మొదలెట్టారు. ఎవరి కంటపడకుండా గోవాకు ఆనుకుని మహారాష్ట్రలో ఉన్న అంబోలి అరణ్యంలో ఓ ట్రక్కులో రేడియో సర్వీస్‌కు అండర్ గ్రౌండ్ క్యాంపు ఏర్పాటు చేసుకున్నారు. గోవాలో ఇద్దరూ కూడా ఎక్కడా కలిసి మాట్లాడుకోవడం కానీ పలకరించుకోవడం గానీ ఉండదు. ఇద్దరూ మారు పేర్లు, వేష ధారణతో గోవాలోకి వెళ్లగలిగారు. సమాచారాన్నిచ్చే వ్యక్తుల్ని అతి రహస్యంగా కలుసుకునేవారు. వారి స్థావరం కూడా అంతుబట్టేది కాదు. అడవిలోని వారు స్థావరం ఏర్పాటు చేసుకునే ప్రాంతాల్లో మడుగులుండేవి. జలగల బాధ ఎక్కువగా ఉండటంతో గమ్‌బూట్స్ వేసుకుని తిరిగేవారు. బ్రాడ్‌కాస్టింగ్ కోసం బేస్‌కు చేరుకుని తిరిగి వచ్చేశాక వాటిని తీసేసి దాచేవారు. ఒక్కోసారి ఈ బూట్లు వేసుకుని తిరిగినా జలగల బెడద తప్పేది కాదు. రేడియో బ్రాడ్‌క్యాస్టింగ్ వల్ల కేవలం సమాచారం అందడమే కాకుండా మిగతా చోట్ల నుంచి గోవా ఉద్యమకారులకు వెల్లువెత్తుతున్న సంఘీభావం, మద్దతు గురించి తెలిసి పోరాటవీరులకు ధైర్యంగా ఉండేది. కాలనీల పాలనలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాల తీరు తెన్నులు కూడా తెలుసుకోగలగడంతో ఉద్యమ పంథాను పటిష్టం చేసుకోవడానికి ఉపయోగపడేది. 1961 డిసెంబర్ 16న భారత సేన గోవాలోకి అడుగుపెట్టబోతున్నాయనే సందేశాన్ని చేరవేశారు. ప్రతి గంటకోసారి ఇదే విషయాన్ని తరచూ ప్రస్తావిస్తూ పోర్చుగీసు వారి మనోబలం దెబ్బతినేలా, కాలనీ సేనలు భయపెట్టేలా హెచ్చరిక సందేశాల్ని పంపారు. ఇక సైనిక చర్య తప్పదనే తరుణంలో విషమిస్తున్న పరిస్థితుల నేపథ్యంలో లిబియా లోబోను, వమన్ సర్దేశాయ్‌ను బేస్ క్యాంప్ నుంచి బెల్గామ్‌లోని సురక్షిత ప్రాంతానికి చేర్చింది భారత సేన. తమ కర్తవ్యాన్ని అక్కడా కొనసాగించారు. బెల్గామ్‌లో తమ అతిథి గృహంలోనే ట్రాన్స్‌మిట్టర్‌లను ఏర్పాటుచేసి అక్కడి నుంచి పరిస్థితుల్ని వివరిస్తూ సమాచారాన్ని ఇచ్చారు. డిసెంబర్ 18న డబోలిమ్ ఎయిర్‌పోర్ట్‌పై బాంబు దాడి జరిగింది. భారత సేన పోర్చుగీసు రక్షణ వలయాన్ని మూడు దిశలా చుట్టుముట్టింది. ఆ రోజు సాయంత్రాని కల్లా కాలనీ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ వద్దకు జర్నలిస్టుల్ని పిలిచి సరెండర్ అవుతున్నట్టు ప్రకటించింది. తర్వాతి రోజు ఉదయం ఓ విమాన దిగువ భాగంలో పెద్ద లౌడ్ స్పీకర్‌ను అమర్చి ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ గోవా అంతటా తిరుగుతూ 2 గంటల పాటు లిబియా లోబో, వమన్ సర్దేశాయ్ విజయ వాణిని వినిపించారు. మధ్యాహ్నం 11 గంటలకు త్రివర్ణ పతాకం ఆవిష్కరించి గోవా స్వేచ్ఛ పొందిందని విమానం నుంచే డిక్లరేషన్‌ను తెలిపారు. కరపత్రాలను జారవిడిచారు. 450 ఏళ్ల విదేశీ పాలన నుంచి విముక్తి పొందిన గోవా ప్రజలు సంబురాలు జరుపుకోండని ఉద్విగ్న స్వరంతో ఆకాశవాణిని వినిపించారు. తర్వాతి కాలంలో పోర్చుగీసు డాక్యుమెంట్లను పరిశీలించగా 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' వారిని ఎంత ఉక్కిరి బిక్కిరి చేసిందో.. ఎంత దెబ్బ కొట్టిందో రోడ్రిగీస్ రిపోర్ట్ ద్వారా తెలిసింది. లిబియా లోబో కంఠం ఉద్యమకారులకు ఎంత బలాన్నిచ్చిందో.. పోర్చుగీసు అణచివేతపై ఎంత పెద్ద దాడి చేసిందో రాసి ఉంది. గోవా విమోచనోద్యమాన్ని మలుపు తిప్పిన ఆ ఇద్దరూ ఉద్యమంలోనే కాదు వ్యక్తిగత జీవితంలోను కలిసి నడిచారు. గోవా స్వాతంత్ర్యానంతరం వివాహం చేసుకుని సుఖదు:ఖాలను పంచుకున్నారు. వమన్ మరణానంతరం లిబియా లోబో పాంజిమ్‌లో గడుపుతున్నారు. వారికి కన్నబిడ్డలు లేరు.. కానీ గోవా ప్రజలే ముద్దు బిడ్డలయ్యారు. కొంకణ్ తీరంలో ఎప్పటికీ లిబియా లోబో స్వరం అలల హోరులో వినిపిస్తూనే ఉంటుంది.

-జే

ఇండెక్స్

మార్గదర్శి........... 1
కొంకణ్ స్వేచ్ఛా స్వరం

విశేషం....................3
తొలి జీవితంలో...

ప్రత్యేకం.............. 4
ఆకాశంలో హై జంప్

కార్టూన్ పంచ్......... 5

కొత్త ఊపిరి

అట్టమీది కథ.........6

స్ఫూర్తి................10
కాళ్లు లేని డాక్టర్

తెలుసా...............11
యజమానిని పట్టేస్తాయి



నా కళ్ళతో - 12
మనవడి ఫొటో జర్నీ

వింతలోకం...............14
సొర చేప చెంత

స్టార్..............16
జావెలిన్‌తో జయించాడు

కథ..............18
విష వలయం

రుచి....................21
మ్యాంగో ఐస్‌క్రీం

బాల నేస్తాలు.............22
బన్నీ పెన్సిల్ స్టాండ్

పదవికాసం..............24

అద్భుత ఆవిష్కరణలు

వివిధ దేశాల్లో స్నేహితులకు శుభాకాంక్షలు తెలిపే తీరు వింత గొలిపాయి. శరీరం సహకరించకపోయినా కాళ్లు చచ్చు బడినా వీల్ చైర్ పైనే ప్రపంచ పర్యటనలు కొనసాగించినా చైనీయుల తెగింపు ఆశ్చర్యపరిచింది.నటనా నవాబ్ కెరీర్ జర్నీ ఆశ్చర్యపరిచింది. కాల్వల్లో నదుల్లో వాడిపడేసిన పూలతో అగరబత్తులను తయారు చేసి విదేశాలకు ఎగుమతులు చేస్తున్న అంకిత్, కరణ్‌ల ది అద్భుతమైన ఆలోచన. రాజస్థాన్ పర్యాటక ప్రాంతాలు ఆకర్షించాయి.

టి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం

అభినందనీయం

కూల్... శీర్షికన వచ్చిన వ్యాసం చాలా ఆకట్టుకున్నది. ప్రస్తుత వేసవి కాలంలో బయటికి వెళ్లేందుకు ఎక్కువ భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలతో పాఠకులకు మంచి అవగాహన కలుగజేశారు. పానీయాలు, ఆహార పదార్థాలు పాటించాల్సిన మెళకువలు ఆకట్టుకున్నాయి. వాడి పోయిన పూలే పెట్టుబడి.. వ్యాసం నన్ను చలింపజేసింది. ఇద్దరు మిత్రుల ద్వయం వున్న ఉద్యోగాలను వదిలిపెట్టి ఇలా వాడేసిన పూలను ఉపయోగించడం

బావుంది. వీరు పడిన ప్రయాస, ప్రయత్నం కొనియాడదగినది. ఎన్నో వ్యర్థ పదార్థాలను పలురకాలుగా మనం మరలా ఉపయోగించవచ్చని చూపారు.

కైపు నాగరాజు,అనంతపురం

సేవా తత్పరత

చదువుకోలేని పిల్లల కోసం ఫుట్‌పాత్‌నే స్కూల్‌గా మార్చి విద్యనందిస్తున్న అహ్మదాబాద్ టీచర్ సేవా తత్పరతని మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నాం. మగాళ్లకు ధీటుగా కుస్తీ పోటీల్లో రాణిస్తున్న సివంగి సిస్టర్స్ విజయాల వెనుక దాగిన శ్రమ, వారి కష్టాలు గగుర్పాటు తెప్పించాయి. ఎడారి తప్ప వేరేదీమీ లేదనుకునే రాజస్థాన్ పర్యాటకంగా ఎంతగా అభివృద్ధి చెందుతోందో అక్కడున్న కళలను, కోటలను చూసేందుకు విదేశీయుల అభిరుచి, పర్యాటక ప్రాంతంగా మారతున్న రాజస్థాన్ వివరాలు ఆద్యంతం చదివించాయి. ఇవీ పలకరింపులే, సివంగి సిస్టర్స్ బాగున్నాయి. కార్టూన్ పంచ్, నవ్వుల్ పువ్వుల్, హా ఫన్నీ నవ్వు తెప్పించాయి.

కల్పన, విజయనగరం

కనువిప్పు

పేదరైతుల అప్పులను మాఫీ చేయకుండా పెత్తందారులు చేస్తున్న మోసాలను తేటతెల్లం చేసిన రుణ మాఫియా కథ కనువిప్పు . కలిగించేలా ఉంది. పచ్చటి ఇల్లు, పిల్లితో మాటా మంతి, చైనాలో చక్రం తిప్పి.. వ్యాసాలు బావున్నాయి. బాలీవుడ్ తారలనగానే మందుకు ముందుంటారనుకునే అపోహలూ లేకపోలేదు. నటుల్లో మందు ముట్టని వారు కూడా వున్నారనే విషయాలు ఆకట్టుకున్నాయి. నవాజ్ జీవిత మజిలీ, పర్యాటకంగా ఎదుగుతున్న రాజస్థాన్ విశేషాలు, అట్ట మీద కథలో వేసవి గురించి అందించిన జాగ్రత్తలు బాగున్నాయి.

రమణ, విశాఖ

ఆకట్టుకున్న ఫుట్‌పాత్ స్కూల్

పేద పిల్లల కోసం వీధి బడులు నడిపిన వారు.. బ్రిడ్జ్ కింద బడి నడిపిన వారున్నారు.. అయితే ఫుట్‌పాత్‌పై బడిని పదిహేనేళ్లుగా నడుపుతూ పిల్లలకు చదువుతో పాటు భోజనాన్ని కూడా అందిస్తున్న కమల్ పర్మార్ గురించి తెలిపిన విషయాలు ఆకట్టుకున్నాయి. కువాన్ పెంగ్ సాహస యాత్ర.. యాత్రలో తన అనుభవాలను వివరించిన తీరు బావుంది.

ప్రియాంక, తుని

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

విశేషం

వోప్రా విన్‌ఫ్రా

ప్రపంచ స్థాయి ఖ్యాతిని పొందిన ప్రముఖులెందరో తొలినాళ్లలో కష్టాలకు ఎదురీదిన వారే! అలానే నియంతలూ ఒకప్పుడు తలొగ్గి బతికినవారే. మంచి చెడులున్న జీవితంలో తొలి జీవితంలోని కష్టాలు, ఇబ్బందులు వ్యక్తిలో కేవలం చెడే మిగిల్చి ప్రపంచానికే చేటు తెచ్చేంత ప్రభావితం చేసిన సందర్భాలున్నాయి. అలానే కష్టం తగులుతున్న కొద్దీ మంచి మరింత చిక్కబడి జీవితాల్ని చక్కదిద్దుకున్న మార్గదర్శులు ప్రభావం చూపిన బతుకు కథలున్నాయి. ఒక్కో రంగం, ఒక్కో కోణం, ఒక్కో నేపథ్యం, ఒక్కో ప్రభావం నుంచి వచ్చిన వ్యక్తులే వీళ్లు.

తొలి జీవితంలో..

హిట్లర్ పెయింటింగ్

కరడుగట్టిన నియంత అడాల్ఫ్ హిట్లర్ తన చిన్నతనంలో ఆశ్రమ పాఠశాలలో చదువు ప్రారంభించాడు. చిన్నతనంలోనే ఒక ప్రీస్ట్(మత పెద్ద)గా మారాలని కలలు కన్న హిట్లర్ తన తండ్రి మరణించడంతో వృత్తిని ఎంచుకోవడంలో కొత్త సంఘర్షణలు మొదలయ్యాయి. ఇక ఆర్టిస్ట్ అవుదామని బలంగా నిర్ణయించుకున్నాడు. వియన్నా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వాళ్లు పెయింటింగ్‌కి పనికిరావంటూ తిరస్కరించారు. ఆర్కిటెక్చర్‌లో మెరుగవగలవని చెప్పడంతో స్కూల్ రెక్టార్ రికమెండేషన్‌తో ఫైన్ ఆర్ట్‌లో చేరి తన జీవితాన్ని మలుచుకోవానుకున్నా పూర్తిగా శిక్షణ కొనసాగించ లేకపోయాడు. తర్వాత పెయింటర్‌గా వృత్తి మొదలుపెట్టి పోస్టుకార్డులపై ఉండే చిత్రాలను అనుకరిస్తూ తాను గీసిన చిత్రాలను వర్తకులకు, వ్యాపారులకు అమ్మేవాడు. తర్వాత అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేరాలనుకున్న ఆయన ప్రయత్నం మరోసారి విఫలమయ్యింది. సంపాదించిన డబ్బులూ అయిపోయాయి. అప్పటికే సంపాదనా పనీ రెండూ కోల్పోయిన హిట్లర్ శరణార్థిగా మారాడు. 1910 నాటికి ఒక చిన్న కార్మికుడి ఇంట్లో తలదాచుకుంటూ జీవిత మజిలీ ప్రారంభించాడు. తర్వాత వియన్నాలో మొదటి క్రియాశీల వ్యతిరేక సైమన్‌గా బలపడ్డాడు. తర్వాతి చరిత్ర గుర్తుతెచ్చుకున్నప్పుడల్లా ప్రపంచం ఉలిక్కిపడుతుంది.

సిల్వెస్టర్ స్టెలోన్ పాత్ర

హాలీవుడ్ యాక్షన్ హీరో సిల్వెస్టర్ స్టెలోన్ బాల్యం కష్టాల కడలిలోనే సాగింది. తల్లిదండ్రుల మధ్య విభేదాలు ఇంట్లోని ప్రతికూల వాతావరణం, వారు విడిపోవడం వంటి ఎన్నో ప్రతికూల సంఘటనల ప్రభావం ఆయనపై ఎక్కువగానే పడింది. అయినా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి స్విజర్‌ల్యాండ్‌లోని అమెరికన్ కాలేజ్‌లో నటనను నేర్చుకున్నాడు. మరింతగా మెరుగుపడేందుకు స్టెల్లోన్ యూనివర్సిటీ ఆఫ్ మియామీలో చేరాడు. కోర్సు పూర్తి చేయకుండానే యాక్టింగ్ అవకాశాల కోసం న్యూయార్క్ సిటీకి చేరుకోవాల్సి వచ్చింది. కెరీర్‌ని మలుచుకునే తొలి దశలో నిత్యావసరాల కోసం సిల్వెస్టర్ రకరకాల ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. అందులో భాగంగా సెంట్రల్ పార్క్ జూలో సింహాల బోనును శుభ్రపరిచే ఉద్యోగంలో చేరాడు. యాక్టింగ్ అవకాశాలు వరించాక "ఎ పార్టీ ఎట్ కిట్టీ అండ్ స్టడ్స్" సినిమాలో అదే పాత్రలో కనిపించి తెర పరిచయమయ్యాడు.

వోప్రా విన్‌ఫ్రే గొంతు

వోప్రా విన్‌ఫ్రే అమెరికన్ టెలివిజన్ ప్రపంచంలో టాక్‌షోల స్వర్ణయుగానికి తెరలేపిన వ్యాఖ్యాత. తన కన్నవారు టీనేజర్లు కావడంతో చట్టపరంగా వారి వద్ద ఉండే పరిస్థితి లేక పుట్టిన దగ్గర నుంచి బామ్మ దగ్గరే పెరిగింది. మూడేళ్ళు కూడా నిండని వయసులో వోప్రా తన బామ్మతో


హిట్లర్

కలసి ఇంటి వద్దే ఉన్న చర్చిలో బైబిల్ పాటలను పాడుతుండేది. చిన్న వయసులోనే తన జ్ఞాపక శక్తి, ఉచ్ఛారణకు అభిమానులైపోయి అందరూ ఆమెను 'ది ప్రీచర్' అని ముద్దుగా పిలుస్తుండేవారు. తన జీవిత గమనానికి తనే బాటలేసుకుంటూ పెరిగింది వోప్రా. ఆమె 16వ ఏట రేడియో స్టేషన్ వారు నిర్వహించిన ఓ ప్రమోషనల్ కాంటెస్టులో గెలుపొంది బహుమతిగా వచ్చిన వాచీని తీసుకునేందుకు స్టేషన్‌కు వెళ్లింది. ఆమె మాట తీరుకు ఫిదా అయిపోయిన నిర్వాహకులు అక్కడే అప్పుడే ఆన్ ఎయిర్ రిపోర్టర్‌గా వారానికి 100 డాలర్ల జీతంతో ఉద్యోగాన్నిచ్చేశారు. ఆమె సెలబ్రెటీలకే సెలబ్రెటీగా మారింది.

బెనిటో ముస్సోలిని కథ

ప్రపంచ మొట్టమొదటి నియంత ముస్సోలిని తొలుత ఒక కథా రచయిత. 'పొపొలో ది ఇటాలియా' అనే సోషలిష్టు పత్రికలో చేరిన ముస్సోలిని ఓ సీరియల్‌కి కథ రాసేవాడు. తను రాసిన అప్పటి కథే "ది కార్డినల్స్ మిస్ట్రెస్" నవలగా ప్రచురితమైంది. వింతగా హిట్లర్, ముస్సోలినీలిద్దరూ సృజనకారులే. కళారంగంపై గొప్ప ముద్ర వేయాల్సిన వారు. ఇప్పటికీ హిట్లర్ పెయింటింగ్‌ల్ని గొప్ప కళాఖండాలుగానే పరిగణిస్తారు. ముస్సోలినీ రాసిన కథను చదువుతూనే ఉన్నారు. కానీ ఇద్దరూ కూడా కూడబలుక్కుని ప్రపంచంలో కలకలం రేపారు.


'రాంబో' స్టెలోన్


ముస్సోలిని

- శర్వాణి

ఆకాశంలో హై జంప్

పదివేల అడుగుల ఎత్తు నుంచి నేల ఎలా కనిపిస్తుంది. ఆగండి.. గూగుల్ మ్యాప్స్‌లో శాటిలైట్ ఇమేజెస్ సెర్చ్ చేసేయకండి. మేం చెప్పేది అమాంతం మీరు నేల జారుతూండగా చూస్తుంటే ఎలా ఉంటుందనేది. పై ప్రాణం పైనే పోయేంత గగుర్పాటు కల్పించే స్కై డైవ్ చేస్తే ఆ థ్రిల్లే వేరంటారు డేర్ డెవిల్స్. కేవలం ప్రొఫెషనల్ స్కైడైవర్లే కాదు ఔత్సాహికులకు కూడా ఆ చాన్స్ ఉంది. భారత్‌లో స్కై డైవ్‌కు కొన్ని బెస్ట్ స్పాట్లు, ఏర్పాట్లున్న ప్రాంతాలివే.

పక్షుల రెక్కల్ని చూసి తెగ జెలసీ ఫీలయ్యే మనం.. ఇలా. స్కై డైవ్‌లతో వాటికీ జెలసీ పుట్టించొచ్చు అంటారు వాళ్లు. తేలిగ్గా ఉండే అవి మనంత వేగంగా గాలిని చీల్చుకుంటూ సూపర్ మ్యాన్ ఎఫెక్ట్ చవిచూడలేవట. అయితే ప్రతిచోట అలా విమానంలోంచి ఎగిరి దూకేసి కాసేపు మబ్బుల్లో ఈదేసి తర్వాత ప్యారాచ్యూట్‌తో దిగేస్తే థ్రిల్లింగా.. ఉంటుంది కానీ మరో ఎఫెక్ట్ మిస్సవుతారు. అద్భుతమైన సందర్శన కేంద్రాలు నేల మీదే కాదు.. ఆకాశం మీది నుంచి చూడాల్సినవి కూడా ఉన్నాయి. స్కై డైవింగ్‌కు అనుకూలమైనవి అలాగే దృశ్య కావ్యాలైన బెస్ట్ స్పాట్‌లున్నాయి. పక్కా ప్రొఫెషనల్ కాకపోయినా ఫర్వాలేదు. అసలా అనుభూతి చూడాలంటే టాండెమ్ జంప్ చేసేయొచ్చు. ఓ ప్రొఫెషనల్ స్కై డైవర్‌కు అటాచ్ అయ్యి ఉంటారు. అతడే ఎప్పుడు జంప్ చేయాలి. ఎప్పుడు ప్యారాచ్యూట్ కార్డ్ లాగాలో అతడు చూసుకుంటే మనం మాత్రం అడ్రినలిన్ రష్‌తో మరింత స్పష్టంగా కనిపించే దృశ్యాల్ని చూసుకోవచ్చు. ఇక స్టాటిక్ లైన్ జంప్ విషయానికొస్తే.. విమానానికి ఓ కార్డ్‌తో కనెక్ట్ అయ్యి ఉంటారు. 3 క్షణాల ఫ్రీ ఫాల్ తర్వాత ప్యారాచ్యూట్ ఆటోమేటిక్‌గా తెరుచుకుంటుంది. ప్యాసెంజర్ చేయాల్సిందేమి ఉండదు. కానీ ఇది 3 వేల అడుగుల ఎత్తు నుంచి మాత్రమే ట్రై చేయాలి. దీనికి ముందుగా 6 గంటల శిక్షణ ఉంటుంది. అస్సెలెరేటెడ్ ఫ్రీ ఫాల్ అనేది మాత్రం వోన్లీ డేర్‌డెవిల్స్‌కే. దేనికీ అటాచ్ కాకుండా అలా విమానంలోంచి వేగంగా పడిపోతారంతే. సూక్ష్మ శరీర కదలికలతో రివ్వునదూసుకుపోతుంటారు. దీనికి పది వేల అడుగుల ఎత్తు కూడా చాలదు. 13 వేల అడుగుల ఎత్తు నుంచి ఈ సాహస విన్యాసాన్ని చేయాలి. దీనికి క్లాస్‌రూమ్ శిక్షణతో పాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య స్కై డైవ్ చేయిస్తారు.వీటిలో ఏదో ఒకటి ఎంచుకుంటే దేశంలో ఎక్కడ ఆ స్కై డైవింగ్‌లకు అవకాశం ఉందో వెతికితే సరి.

హిల్స్‌లోకి దూకి...

కర్నాటకలోని మైసూర్‌లో చాముండీ హిల్స్ అందం ఆకాశం నుంచి చూస్తే అల్టిమేట్ అనిపిస్తుందట. టాండెమ్ జంప్‌కు 35 వేల రూపాయల ఖర్చు అవుతుంది. శిక్షణ నుంచి బుల్లి విమానంలో మబ్బుల పైకి చేరాక మళ్లీ కిందకు వచ్చేది ప్యారాచ్యూట్‌లోనే. ఇక్కడ యాస్సెలెరేటెడ్ ఫ్రీ ఫాల్‌కు కూడా అవకాశం ఉంది. కానీ దానికి రెండున్నర లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. సుమారు వారం రోజుల పాటు శిక్షణ జంపింగ్‌లకు సమయం పడుతుంది. 10 జంప్‌లకు అవకాశం ఉంది. స్కైరైడర్స్ వసతుల్ని ఏర్పాటు చేస్తున్నారు.

దీసాలో దిశ మారి...

గుజరాత్‌లోని దీసా కూడా స్కై డైవింగ్ వసతుల్ని కలిగి ఉంది. లేక్‌సైడ్ సిటీ అయిన ఇక్కడ మూడు రకాల జంప్‌లకు అవకాశం ఉంది. గుజరాత్ క్రీడా ప్రాధికార సంస్థ (శాగ్), ఇండియన్ ప్యారాచ్యూటింగ్ ఫెడెరేషన్‌లు ఏర్పాట్లు చూసుకుంటున్నాయి. ఇక్కడ స్టాటిక్ లైన్ జంప్‌కు సుమారు 17 వేలు, టాండెమ్ జంప్‌కు 34 వేలు, యాసెలెరేటెడ్ ఫ్రీ ఫాల్‌కు 38 వేలు ఖర్చయ్యే అవకాశం ఉంది.

సంద్రం..ఆకాశం..భూమి..

తమిళనాడులోని పుదుచ్చేరిలో అయితే సముద్రం, ఆకాశం, భూమి మధ్య రివ్వుమనొచ్చు. ఇక్కడ టాండెమ్, స్టాటిక్ లైన్ జంప్‌లకు అవకాశం కల్పిస్తున్నాయి వాల్టైర్ ఎస్కేప్‌డ్, స్కైరైడర్స్. ఒక స్టాటిక్ జంప్‌కు 18 వేలు.. అదే 5 జంప్‌లకు 62 వేలు అవుతాయి. టాండెమ్ జంప్‌కు 27 వేలు ఖర్చు చేయాలి.

వ్యాలీలోకి వేగంగా...

మహారాష్ట్రలోని యాంబీ వ్యాలీ యాంబియన్సే వేరు. ముంబైకర్లు, పూనే సాహస యువతకు ఇప్పుడది బెస్ట్ స్పాట్ అయ్యింది. ఒక్కసారైనా డైవ్ చేయాలని బకెట్ లిస్టుల్లో టిక్ కొట్టుకుంటున్నారు. లోయ లోతుల్లోకి జారిపోతున్న ఆ ఫీలింగే వేరంటారు వాళ్లు. జీవితంలో ఇలాంటి అనుభూతి మరొటుండదంటూ గట్టిగానే చెబుతారు. కానీ కొండలు, కోనల మధ్య నీటి తావున ఆకాశంలోంచి ఫ్రీ ఫాల్ చేయాలంటే గట్టి గుండె ఉండాలి. అందుకే ప్రస్తుతానికి టాండెమ్ జంప్‌కు ఏర్పాట్లు చేశారు. దీనికి దాదాపు 20 వేల రూపాయలు ఖర్చవుతాయి. అదే వారాంతాల్లో అయితే 25 వేల దాకా పెట్టాలి.

మధ్యప్రదేశ్‌లోని ధన ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ ఎయిర్ స్ట్రిప్ ఉంది. ఇక్కడే ఎక్కువగా స్కై డైవింగ్ క్యాంపులుంటాయి. ఫ్రీఫాల్ కోసం డేర్‌డెవిల్స్ ఇక్కడకు వస్తుంటారు. టాండెమ్‌కు 35–37 వేలు, స్టాటిక్‌కు 24 వేలు ఖర్చవుతాయి. షైమ్స్ ఏవియేషన్ అకాడమీ, వాల్టైర్ ఎస్కేప్‌డ్ థ్రిల్స్ ఏర్పాట్లు చేస్తాయి. ఏ స్పాట్‌కు తగ్గట్టు శిక్షణ ఉంటుంది. ఖర్చులో కూడా మార్పుచేర్పులుంటాయి. ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ✦



యజమానిని పట్టేస్తాయ్

కుక్కలు వాసన బట్టి ఇతరుల ఉనికిని కనిపెడతాయి. అవి సహజాతి ఉనికి కంటే యజమాని జాడను త్వరగా గుర్తిస్తాయి. యజమాని వాటి పక్కనున్నదీ లేనిదీ ఇట్టే పసిగట్టేయగలవు.

ఎలుకలకూ జ్ఞాపకాలుంటాయి



ఏదైనా పని చేస్తే దాని తాలూకు జ్ఞాపకాలు మన మొదడులో కొంత కాలం అలా ఉండిపోతాయి. మనుషులు మెదడులో భద్రపరుచుకున్న తమ జ్ఞాపకాలను అవసరమొచ్చినపుడు గుర్తు చేసుకుంటారు. ఎలుకలుకు కూడా అచ్చం ఇవే లక్షణాలున్నాయని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్ వారు ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో తేలింది. ఎలుకల మొదడులోని ఏ భాగం పనితీరు వల్ల వీటికీ లక్షణాలు వచ్చాయో కనిపెట్టాల్సి ఉంది.

తోడేళ్లే బాగా కాపీ కొడతాయి

ఒకే వయసున్న కొన్ని శునకాలు, తోడేళ్లపై 'డబ్బా మూత తెరిచే' ప్రయోగాన్ని చేశారు. శిక్షణ పొందిన ఒక కుక్కతో బాక్సు మూత తీయిస్తే.. దాన్ని చూసి తోడేళ్ల గుంపంతా అలానే చేయగలిగాయి. కానీ మిగతా కుక్కలు మాత్రం కాపీ కొట్టలేకపోయాయి. ఈసారి కొంచెం పెద్ద వయసున్న తోడేళ్లు, కుక్కలతో ప్రయోగం చేశారు. అయితే శిక్షణ పొందిన శునకంతో మూత తీయించలేదు. ఎలాంటి హింట్ లేకపోవడంతో మూత ఎలా తీయాలో తెలీక తోడేళ్లు కుస్తీ పడటంతో అవి కాపీ కొట్టే మూత తీశాయని శాస్త్రవేత్తలు తేల్చారు.

అభినయం వీటికీ తెలుసు



నటించడం మనుషులకే కాదండీ జీబ్రా ఫ్రించెస్ అనే పక్షులకీ బాగా తెలుసు. వీటికి ఆరోగ్యం బాగోకపోయినా.. సహచరుడు వస్తే అనారోగ్య లక్షణా లను ముఖంపై కనపడనీవు. ప్రమాద సమ యంలో శత్రువుల నుండి తమను తాము రక్షించుకునేందుకు బలశాలిగా నటించేస్తాయి కూడా. అంటే ఇవి కూడా మనుషుల్లాగే పరిస్థితులని బట్టి వాటి బాడీ లాంగ్వేజ్‌లో మార్పులు చేసుకుంటాయి.

బుర్ర కొంచెం కూత ఘనం

కొన్ని రకాల పిచ్చుకలు అద్భుతంగా పాడతాయి. పాటకారులు మాత్రం మగ పిచ్చుకలేనట. అయితే వీటికి మెమొరీ లాస్ కూడా ఎక్కువే. పాటలను ఎక్కువగా నేర్చుకుంటుండే ఈ పక్షులు ఇతర విషయాలను ఎక్కువగా గుర్తుంచుకోలేవు. పాటలు తక్కువగా పాడే ఆడపక్షులకే ఆహార నిల్వల గురించిన పరిజ్ఞానం ఎక్కువని ఓ పరిశోధనలో తేలింది.

ఈగ.. ఈగ.. ఈగ...

పండ్లపై ఎక్కువగా వాలుతుండే ఈగలు జీవించేది 60 రోజులే అయినా వీటి ఆలోచనా శక్తి మాత్రం ఎక్కువే. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు నిర్వహించిన పరిశోధనలో ఈ విషయాలే తేటతెల్లమయ్యాయి. ఈగలకు ఎక్కువ గాఢ వాసన కలిగి ఉన్న ఓ కంటెయినర్ ద్వారం నుంచి బయటపడేలా హింట్‌లిచ్చారు. ఆ తర్వాత వాసనలోని గాఢతలో అతి కొద్ది తేడాతో ఉన్న మరో ద్వారాన్ని ఉంచారు. అయినా ఆ కొద్ది తేడాను పసిగట్టి గాఢత ఎక్కువున్న ద్వారం నుంచి బయటపడ్డాయి.

మనవడి ఫొటో జర్నీ

తాతయ్య వేలు పట్టుకుని అమెరికా చుట్టేశాడు. భుజాల పైకెక్కి జూపార్క్‌లో జీబ్రాను మూతిని నిమిరాడు. సముద్ర తీరంలో ఏరుకొచ్చిన గవ్వల్ని బామ్మకు మురిపెంగా చూపించాడు. ఆ జ్ఞాపకాలన్నింటినీ తాతయ్య ఫొటోల్లో పదిలం చేశాడు. పెద్దయ్యాక వారితో మరో జాలీ యాత్ర చేద్దామనుకుంటే తాతయ్య దూరమయ్యాడు. బామ్మ జ్ఞాపకాలతో బతికేస్తోంది. ఫొటోగ్రఫీ, యాత్రలకు అంకితమైన వారిద్దరికో అపూర్వమైన బహుమతి ఇవ్వాలనుకున్నాడు క్రిస్టియన్ కర్రొలో. అందుకే 30 ఏళ్ల క్రితం బామ్మ, తాతయ్యలు కలసి చేసిన ప్రేమ యాత్రల ఫొటోల్లోని స్పాట్‌లకు వెళ్లి వాటిని మళ్లీ తన కెమెరాలో బంధించి కాలానికి వంతెన కట్టాడు. రిక్రియేషన్ చిత్రాల ఫొటో జర్నీ మొదలెట్టి అరుదైన అల్బమ్ ఆవిష్కరించి వారిపై ప్రేమకు పటం కట్టాడు.

పాస్ట్ ప్రెజెంట్ యాత్ర అనుకోకుండా వచ్చిన ఐడియా. 2012 అక్టోబర్‌లో మాంటిగోమెరీకి చెందిన క్రిస్టియన్ కర్రొలో (33) ఒరెగాన్ కోస్తా ప్రాంతంలో పర్యటించాలని అనుకున్నాడు. ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తుండగా అతడికి తాతయ్య గుర్తొచ్చాడు. ఆయనెప్పుడు ఒరెగాన్ సముద్రం ఒడ్డున జ్ఞాపకాలనే పదే పదే చెబుతుండేవాడు. భార్యతో వెళ్లిన సంగతి ఆ ఫొటోగ్రాఫ్‌లను పదిలంగా ఓ బాక్స్‌లో దాచి పెట్టుకున్న సంగతి గొప్పగా చెప్పేవాడు. వెంటనే కర్రొలో తాతయ్య, అమ్మమ్మలు దిగిన ఫొటోల ఆల్బమ్‌ను తడిమి చూశాడు. అవి 1970-80ల మధ్య వారి యాత్రలకు చెందిన జాడలు. వాటిలో కొన్ని బెస్ట్ స్పాట్స్ ఉన్న ఫొటోల్ని కూడా తీసుకెళ్లాడు. అలా ఒరెగాన్ ప్రాంతంలో తిరుగుతుండగా అంతకు ముందు తాతయ్య ఫొటోలో చూసిన ప్రాంతం ఏ మాత్రం కాలంలో చెదిరిపోనట్టు ఎదుట పడేసరికి ఆశ్చర్యపోయాడు. వించెస్టర్ బే అనే చిన్న కోస్తా పట్టణంలోని ఓ పాత భవనమది. వెంటనే ఫొటో తీసి చూస్తే అచ్చు అలానే ఉంది. తాతయ్య ఎలా ఫోజు పెట్టి దిగాడో తాను అలాగే ఓ ఫొటో క్లిక్‌మనిపించాడు. అప్పుడు బుర్రకు తట్టింది. ఇలా ఫొటోలోని లొకేషన్లు, కట్టడాలు, స్పాట్‌లలో తిరుగుతూ 35 ఏళ్ల క్రితం అప్పుడవి ఎలా ఉన్నాయో ఇప్పుడు ఎలా ఉన్నాయో కొత్త ఫొటోల్లో బంధిస్తే ఎలా ఉంటుందనే సరదా ఆలోచన కలిగింది. తొలుత సరదా అనుకున్నా ఆ తర్వాత అదో గొప్ప అనుభూతుల్ని మిగిల్చి, గురుతుల్ని నిలిపే అద్భుతమైన ఫొటో జర్నీ అని తెలుసుకున్నాడు. ఇక దీన్ని ఆషామాషీగా తీసుకోకుండా దానికి 'పాస్ట్ ప్రెజెంట్ ప్రాజెక్ట్' అని పేరు పెట్టేసి ఒక్క ఒరెగాన్ ఏమిటీ మొత్తం అమెరికా యాత్రకు తాతయ్య ఆల్బమ్‌ను వెంటేసుకుని ప్రయాణం కట్టాడు. వింటేజీ ఫొటోలకు మరింత విలువ పెంచాడు. వెలకట్టలేని అనుభూతుల్ని మూటగట్టాడు. ముందుగా బామ్మ రాసుకున్న యాత్ర డైరీని తెరిచి వారి యాత్ర విశేషాలు తెలుసుకున్నాడు. 101 ఏళ్ల వయసులోను ఇంకా భర్త జ్ఞాపకాలను పదిలంగా హృదయంలో నిలుపుకున్న బామ్మనడిగి ఏ ఊరు నుంచి మొదలు పెట్టారు.. ఎలా ప్రయాణించారు.. ఎటు దారి పట్టారు... ఇలా ఎన్నో వివరాల్ని సేకరించాడు. ఫొటోలన్నింటినీ జాగ్రత్తగా గమనించి ఆ ప్రాంతాల ఆనవాలు ఇప్పుడున్నాయో లేదోనని సమాచారం తెచ్చుకున్నాడు. డజన్ల కొద్దీ ఫొటోగ్రాఫ్‌ల్లోని లొకేషన్లలో అంత మార్పులేవి కనిపించలేదు. అలా అతడి మిషన్‌కు ఓ రూపు సంతరించుకుంది. ఆ ఫొటోల్లోని ప్రాంతాల రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుని బయలుదేరాడు. ఈ ఫొటో జర్నీలో ఇది నాలుగో ఏడాది.

ఫొటోగ్రఫీ.. యాత్ర రెండూ..

కర్రొల్ తాతయ్య హెర్బర్ట్ డి.కన్నెలాన్ అధికారి. బ్రూక్లిన్‌లో పుట్టి పెరిగిన ఆయన చాలా ఏళ్లపాటు నస్సా కౌంటీలోనే సేవలందించారు. గొప్ప యాత్రా పిపాసి. ఆయన ఏదో ఒక యాత్ర చేస్తూనే ఉండేవాడు. ముఖ్యంగా అమెరికాలో ఉండే జాతీయ పార్కులు, చారిత్రాత్మక స్థలాలంటే కాలు ఆగేది కాదు. 1974లో రిటరయ్యాక భార్య రూత్‌ను తీసుకుని ముప్ఫై ఏళ్ల పాటు విరామం లేకుండా ఏదో ఒక యాత్ర చేశాడు. అదే తీరు వచ్చింది మనువడికి కూడా. 2008లో తాతయ్య చనిపోయాక ఆయనకు ఎలా నివాళి ఇవ్వాలో అర్థం కాలేదు. కర్రొల్‌కేమో ఫొటోగ్రఫీయే జీవితం. యాత్రలంటే తాతయ్యకు ప్రాణమనే విషయం తెలుసు.. ఈ రెంటినీ కలుపుతూ.. ఫొటో జర్నీతో ఆయనపై ప్రేమను ప్రత్యేకంగా వ్యక్తం చేయాలని అమెరికా అంతటా తిరిగి పాత తలపుల్లో కొత్త గురుతులు నిలిపాడు. దీన్నే రిక్రియేషన్ ఫొటోగ్రఫీ అంటారు. తొలుత అచ్చు పాత ఫొటోలో ఉన్నట్టే కొత్త ఫొటోల్ని తీసేవాడు. తర్వాత కొత్తగా తీస్తోన్న

ఫొటోలో పాత ఫొటో కనబడేట్టు పెట్టి క్లిక్‌మనిపించేవాడు. దీని వల్ల ఎక్కడలేని ప్రత్యేకత ఆ ఛాయాచిత్రాల్లోకి చొచ్చుకొచ్చింది. పాత కాలం ఇప్పటి క్షణాల్లోని ప్రాంతాలను బేరీజు వేసుకుని 'అరే 30 ఏళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉందే!' అంటూ అవాక్కయ్యేందుకు అవకాశం కల్పించింది. ఇదే కాదు మరిచిపోలేని క్షణాల్ని అందించింది. ఇలా రిక్రియేట్ చేసిన ఫొటోల్లో బెస్ట్ అనుకున్నవాటిని జాగ్రత్తగా ఎంచుకుని బామ్మకు బహుమతిగా ఇచ్చాడు. వాటిని తదేకంగా చూసిన ఆమె కళ్లు సంతోషంతో చెమర్చాయి. ఆ గాజు కళ్లలో ఎక్కడలేని కాంతిని, ఆ నవ్వులో కళని చూసి తన మిషన్ సక్సెస్ అయ్యిందని.. భావోద్వేగానికి లోనయ్యాడు. కొన్నాళ్లకు ఆమె మనువడికి ఓ ఉత్తరం రాసింది. యాత్రల ఫొటోల్ని భర్త ఎంత జాగ్రత్తగా చూసుకున్నది, ఎంత ప్రయాసపడి ఆల్బమ్ చేసింది, అవి ఎంత ప్రాణ ప్రదమో వివరించి చెప్పి.. ఈ రిక్రియేటివ్ ఫొటో జర్నీకి మించిన నివాళి మీ తాత దృష్టిలో ఉండదని మనువడిని మాటలతోనే ముద్దాడింది. వాటిని కర్రొల్ తల్లిదండ్రులు అంతగా పట్టించుకోని విషయాన్ని చెప్పి బాధపడింది. ఆయన బతికి ఉంటే నిన్ను గట్టిగా హత్తుకుని గంటల పాటు అలా ఉండిపోయేవాడేమో అంటూ కర్రొలోను అభినందించింది.

30 ఏళ్ల కాలానికి ముడివేసి..

ఎల్లో స్టోన్, ఇడాహో, ది టెటాన్స్, సాల్ట్ లేక్‌ల్లో 9 రోజులు పర్యటించి 100 షాట్లు తీశాడు.



కెఫే డి మొండె



ది గోల్డెన్ గేట్ బ్రిడ్జి

కర్రొలో హెర్బెర్ట్. ఇంకా 250 షాట్లు బాకీ ఉన్నాయి. అంతలా తిరిగేవాడు శాన్‌ఫ్రాన్సిస్కో పర్యటనకు ముందు కర్రొలో మరింత ప్రొఫెషనల్‌గా ప్రిపేర్ అయ్యాడు. సందర్శన ప్రాంతాలకు వెళ్లే ముందు రోజు తాతయ్య తీసిన చిత్రాల్లోని లైటింగ్ ఎలా ఉందో పరిశీలించాడు. అలాగే ఎఫెక్ట్ ఉండేలా ఫొటోలు ఎలా తీయాలో ట్రయల్స్ వేశాడు. ఈ సారి పర్యటన మరింత ఆసక్తికరంగా సాగింది. 1979లో ఫిషర్‌మెన్ గ్రోట్టోను సీనియర్ హెర్బెర్ట్ కర్రొల్ ఫొటో తీశాడు. అందులో ఓ వెయిటర్ కూడా ఉన్నాడు. ఆ ఫొటో పట్టుకుని కర్రొల్ ఆ చోటకు చేరుకున్నాడు. అందులో వున్న వ్యక్తిని అక్కడి వాళ్లు గుర్తు పట్టారు. ఇప్పటికీ ఆయన ఆ గ్రోట్టోలోనే పనిచేస్తున్నాడని ఇప్పుడే పని ముగించుకుని బార్ వద్ద రిలాక్స్ అవుతున్నాడని చెప్పడంతో కర్రొలో ఉత్సాహం మరింత ఎక్కువైంది. వెంటనే ఆయన వద్దకు పరుగున చేరుకుని తన మిషన్ సంగతి చెప్పాడు. తన తాతయ్య తీసిన ఫొటోను ఆ వెయిటర్ ముందు ఉంచాడు. యుక్త వయస్సులో ఉన్న తన ఫొటోను చూసుకుంటూ కొన్ని నిమిషాల పాటు మురిసిపోయాడు వెయిటర్. కర్రొలో ప్రయత్నాన్ని మెచ్చుకుని మరోసారి అదే స్పాట్‌లో అదే స్టిల్ ఇస్తూ తాజా ఫొటో దిగేందుకు ఒప్పుకున్నాడు. అలా ఓ అరుదైన ఫొటో ప్రాణం పోసుకుంది. ఇప్పటి వరకు ఉన్న కలెక్షన్‌లోని ప్రత్యేకమైన ఫొటోల్లో ఇదొకటి. అదిచ్చిన కిక్కుతో ఆ ట్రిప్‌లో మరో 50 ఫొటోల్ని రిక్రియేట్ చేసేశాడు కర్రొలో కాదు.. కాలిఫోర్నియా కస్టర్ స్టేట్ పార్క్‌లోని నీడిల్స్ హైవేలోని నీడిల్స్ రాతి బండలు (1973, 2013), బాడ్‌ల్యాండ్స్ జాతీయ పార్క్‌లోని సెడార్ పాస్ క్యాంప్ గ్రౌండ్ (మే 1981, అక్టోబర్ 2013), మిస్సిసిప్పి నాట్జెలోని స్టాంటన్ హాల్ (సెప్టెంబర్ 1974, ఏప్రిల్ 2014), లూసియానా న్యూ ఆర్లీన్స్‌లోని సెయింట్ లూయిస్ కేథెడ్రెల్, కెఫే డు మొండె, మాడిసన్ వీధి, సెయింట్ ఫ్రాన్సిస్‌విల్లేలోని రోజ్‌డౌన్ ప్లాంటేషన్ (ఫిబ్రవరి 1978, ఏప్రిల్ 2014), కాలిఫోర్నియా శాన్‌ఫ్రాన్సిస్కోలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జి, మారిటైమ్ హిస్టారికల్ పార్క్, యోసెమైట్ నేషనల్ పార్క్, టన్నెల్ వ్యూపాయింట్ (ఏప్రిల్ 1979, మే 2015), తహో సౌత్ లేక్ వద్ద ఉన్న వలహల్లా ఫైయిర్ (జూన్ 1981, మే 2015)ల ఫొటోలు కూడా పాత రోజులు, కొత్త రోజులను ట్యాగ్ చేస్తాయి.

జీవిత కాలంలో..

కర్రొలో తాతయ్య అద్భుతమైన ఫొటోలు తీస్తే.. బామ్మ ప్రయాణ విశేషాలతో అద్భుతమైన జర్నల్స్ రాసి పెట్టుకుంది. ఆమె వర్ణించిన, వివరించిన ఆ స్పాట్లలోకి ముందుగా ఆమె చిత్రీకరించినట్టు మనసులో టైమ్ ట్రావెల్

చేసేశాడు కర్రొలో. ఆమె కళ్లతో ఆ స్పాట్లు ఎలా ఉన్నాయో అలా వాటిని ఇప్పుడు వీక్షించి మరింత ఉద్విగ్నతకు లోనయ్యాడు. ఆమె జర్నల్స్‌లో పేర్కొన్న ప్రతి ప్రాంతపు తాజా ఫొటోలకు ఆమె నోట్స్‌ను జతచేశాడు. సైన్‌బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్, వీధి దీపాలు, వృక్షాల సరళి, వ్యాపార దుకాణాల పేర్లు, రాతి బండలు, భవనాల కట్టుబడి ఇలా ప్రతి డిటైల్‌ను జాగ్రత్తగా ఫ్రేమ్‌లో పట్టేశాడు. ఇంత పక్కాగా ప్రాజెక్ట్‌ను పూర్తిచేసిన కర్రొలో ఫొటో జర్నీ గురించి తెలుసుకున్న వారంతా ఆయన్ని ప్రశంసలతో ముంచెత్తారు. తల్లి జుడీ కుటుంబం, బంధువులే కాదు చుట్టు పక్కల వారు అతణ్ని కలసి ప్రత్యేకంగా అభినందించారు. ఇక మీడియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిందేముంది. అతడి యాత్ర గురించి వరస కథనాలు, ప్రత్యేక ఎపిసోడ్‌లు, కార్యక్రమాలతో స్థానిక మీడియా నుంచి అంతర్జాతీయ మీడియా వరకు హోరెత్తించాయి. ఇది కర్రొలోను విస్మయపరిచింది. ఓ అనుకోని చిన్ని ప్రయత్నం ఇప్పుడు ఇంతలా తనను ఓ సెలబ్రిటీలా మార్చేస్తుందని ఊహించలేకపోయాడు. ఈ ఫొటో జర్నీకి అతడు పడిన ప్రయాస భారం దూది పింజలా తేలిపోయింది. అన్నింటి కన్నా ముఖ్యంగా తాత జ్ఞాపకాలను ఫ్రేమ్ కట్టి బామ్మకు ఇవ్వడమనేది తన జీవితంలో సాధించిన గొప్ప విషయం. ఇప్పటికీ అమెరికాలో తాతయ్య చేసిన యాత్రా చిత్రాల రిక్రియేషన్ పూర్తి కాలేదు. ఇంకా ప్రపంచ యాత్రల ఆల్బమ్స్ అట్టే ఉన్నాయి. ఈ ఫొటో జర్నీ ద్వారా బోలెడు విషయాలు, జీవిత పాఠాలు నేర్చుకున్నాడు కర్రొలో. వాళ్ల అమ్మమ్మ, తాతయ్యలు చెప్పినట్టు నలుగురితో మంచిగా, కలివిడిగా మాట్లాడటం చాలా ముఖ్యమని ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాడు. ఈ విషయమే అతడి ప్రాజెక్ట్‌ను తేలిక చేసింది. పోల్చుకోలేని స్పాట్ల గుట్టును కూడా పట్టి ఎట్టకేలకు చేర్చింది. గొప్ప మనసున్న వ్యక్తులు, మిత్రులను కూడా అందించింది.

- అనన్య ప్రసిద్ధ్

కడుపు చల్లగా..

భారత్‌లో ఆహార వృథా దాదాపు 40 శాతమని లెక్కలు. పెళ్లిళ్ల విందు వంటి వాటిల్లోనే కాదు ఇందులో రెస్టారెంట్ల వాటా కూడా ఎక్కువే. ఈ వేస్టేజ్‌ని తగ్గించేందుకు కోచ్చిలో 'పాప్‌డా వడ' రెస్టారెంట్‌ని నడుపుతున్న మిను పాలిన్‌కి ఓ మంచి ఐడియా తట్టింది. తమ రెస్టారెంట్ ముందు 'ది ట్రీ ఆఫ్ గుడ్‌నెస్' పేరిట ఓ రెఫ్రిజిరేటర్ పెట్టింది. రెస్టారెంట్‌లో మిగిలిపోయిన ఆహారాన్ని వృథా చేయకుండా ఇందులో ఉంచుతారు. మిగిలిన రెస్టారెంట్ల వారికీ ఈ విషయాన్ని చెప్పి ఆహారాన్ని సేకరిస్తున్నారు. డబ్బు చెల్లించి కడుపు నింపుకోలేని వారు ఈ ఫ్రిజ్‌లోంచి ఆహార పొట్లాలు తీసుకోవచ్చు. రోజూ అదనంగా ఓ 50 మందికి సరిపోయే ఆహారాన్ని వండించి ఉంచుతోంది మిను. ఆహారాన్ని వృథా చేయకూడదనే ఆలోచన ఉన్న వారెవరైనా ఇందులో ప్యాక్ చేసిన ఆహారాన్ని ఉంచొచ్చు. అయితే దానిపై వారు తేదీని వేసి ఉంచాలి. అన్నార్తుల ఆకలి తీర్చడంతోపాటు వారి ఆరోగ్యమూ ముఖ్యమే! ఇళ్లలో, హాస్టళ్లలో ఇలా ఎక్కడ ఆహార పదార్థాలు మిగిలినా వాటిని 'ట్రీ ఆఫ్ గుడ్‌నెస్'లో ఉంచొచ్చు. ఉచిత ఆహార సేవలు మరింత మందికి అందుబాటులో ఉండేందుకు సిటిలో తను కొత్తగా తెరిచిన మరో రెస్టారెంట్ ముందు కూడా ఇలాంటి రిఫ్రిజిరేటర్‌నే ఉంచింది. అందులో రోజుకు 200–300 వరకు ఆహార పొట్లాలు ఉంటున్నాయి. ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని.. ఓసారి తమ రెస్టారెంట్ వెనుక వున్న ఖాళీ ప్రదేశంలోని చెత్తలో కొందరు ఆహారం కోసం వెతుకులాడటం చూసి చలించిపోయానని అప్పుడే ఏదైనా చేద్దామని ఇలా ఓ చిన్న ప్రయత్నం మొదలుపెట్టానని మిను అంటోంది.

వింత లోకం



సొరచేప చెంత...

సొర చేపలు చుట్టూ తిరుగుతుంటే మీరేమో నీళ్లలోని ఓ అద్దాల పెట్టెలో వాటి మధ్య నైట్ ఔట్ చేసేయొచ్చని అంటోంది ఎయిర్ బీఎన్‌బీ అనే వసతి సంస్థ. ప్యారిస్‌లో ఉన్న ఓ అక్వేరియంలోని 33 సొరచేపల మధ్య లాడ్జి రూమ్‌ను ఏర్పాటు చేస్తానంటోందది. 33 అడుగుల లోతులో ఓ అద్దాల పెట్టెనే గదిగా మార్చేస్తారు. మంచి బెడ్ అవసరమైతే పుడ్ అక్కడే. ఈ వెరైటీ ఆతిథ్యం కోసం ఓ కాంటెస్టు నిర్వహిస్తోంది. దరఖాస్తులో ఈ కాంటెస్టులో మీరు ఎందుకు పాల్గొవాలనుకుంటున్నారనే కారణాన్నీ తెలపాల్సి ఉంది. చాన్స్ కొట్టేస్తే ఓ ఫోటోగ్రాఫర్, గజ ఈతగాళ్లు, సముద్ర శాస్త్రవేత్త బృందం పర్యవేక్షణలో హాయిగా కాసేపు సొరచేపల విన్యాసాలు తిలకించి ఆ తర్వాత ఆవలిస్తూ నిద్రపోవచ్చు.



పుత్తడి 'కళా' భవన్

పసిడి తాపడం పెట్టినట్టు ధగధగలాడే ఓ అపార్ట్‌మెంట్ రష్యాలోని మగదాన్ ఓబ్లాస్ట్ ప్రాంతంలో ఉంది. సాదాసీదాగా కనిపించే ఓ నాలుగంతస్తుల భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఈ అపార్ట్‌మెంట్ అమ్మకానికి పెట్టారు. గోడల మీద, మెట్ల పక్కన ఇంటీరియర్ డిజైన్ల నుంచి కుర్చీలు, మంచాలు, చివరికి టాయిలెట్‌లో ఉండే వస్తువులు కూడా బంగారు రంగును అద్దుకున్నవే. బంగారు కాంతులీనుతున్న ఈ ఫ్లాట్ ఖరీదు అక్షరాలా 57 లక్షలా 60 వేల రూపాయలు. ప్రస్తుత ఓనర్లకు కళాత్మక ఇచ్ ఎక్కువ. వ్యాపారాలపై విదేశాలెళ్లినపుడలా లక్షలకు లక్షలు ఖర్చు చేసి అలంకరణ వస్తువులు తెచ్చి నింపేశారు. నిజమైన బంగారం కాకపోయినా ఇంట్లో ఉండే వస్తువులన్నీ స్వర్ణపు నగిషీతో మెరిసిపోతుండటంతో చూసేందుకు క్యూ కడుతున్నారట.

'చిరు'తా!

జిమ్‌లో ఈ పాపాయి ఏం చేస్తోంది. అయినా వాళ్ల నాన్నకు బుద్ధి లేదా ఏ బరువన్నా తెలీక మీదేసుకుంటే? అని కంగారు పడక్కర్లేదు. ఆ చిన్నారి కసరత్తుల్లో గట్టిది. బరువు అనేది ఈ పిడుగు ముందు చిట్టిది. కాకపోతే ప్రపంచంలోనే అతి కష్టతరమైన అమెరికన్ నేవీ సీల్స్ రూపొందించిన బాటిల్ ఫ్రాగ్ ఎక్స్‌ట్రీమ్ రేస్‌ను అలా పూర్తిచేసేసి ప్రపంచానికి షాక్ ఇచ్చింది మరి. పరుగు, ఈత, ఎత్తులెక్కడం, ముళ్ల కంచె కింద నుంచి పాకడం వంటి 25 సవాళ్లతో కూడిన 5 మైళ్ల సాహస పోటీ ఇది. పోటీకి ముందు ఉదయం 2–6 మధ్య తరచూ నిద్రా భంగం చేస్తూ మెదడు బ్యాలెన్స్‌ను తప్పిస్తారిందులో. అలాంటి ఈ రేసు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కురాలు. దక్షిణ ఫ్లోరిడాకు చెందిన తొమ్మిదేళ్ల ఈ కండల బాలే మిల్లా బిజ్జోటో. 4'4 అడుగులు, పాతికేజీల్లేని ఈ బుడత తన బరువు కన్నా రెండు రెట్లుండే జిమ్ ఐటెమ్స్‌ను చేసి అవతల పడేస్తోంది. ఏడేళ్ల వయసు నుంచే తండ్రి, జిమ్ కోచ్ అయిన క్రిస్టియన్ బిజ్జోటోలతో కలిసి కసరత్తులు మొదలెట్టేసింది. అది కూడా ఎందుకంటే స్కూల్లో పిల్లలు తరచూ ఆమెను ఆటపట్టిస్తుండే వాళ్లట.

సమాజాన్ని పరిచయం చేసే కథలు

తెలుగు కథా సాహిత్యంలో తొలితరం కథకుల్లో ముఖ్యులు చింతా దీక్షితులు. తెలుగు కథ నడకలు నేర్చుకుని సరైన మార్గంలో పయనించడానికి బాటలు వేసిన ముఖ్యుల్లో దీక్షితులు ఒకరు. భాషలో, శిల్పంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న కథకుడు. ఆయన రచించిన కథలను ఏకాదశి కథలు, దాసరిపాట, హాస్యకథలు, మిసెస్ వటీరావు కథలు అని నాలుగు భాగాలుగా వర్గీకరించి 'చింతా దీక్షితులు సాహిత్యం-2' పేరుతో ఈ సంకలనం ప్రచురించారు. ఈ నాలుగు విభాగాల్లోనూ మొత్తం 42 కథలున్నాయి. ఏకాదశి కథల్లో 'శ్యామల' కథలో కథానాయకుడు శ్రీధరరావు బ్రహ్మచారి. ఆయన ప్రేమించిన శ్యామల జబ్బు చేసి మరణించడంతో ఒంటరిగా మిగిలిపోయాడు. హాస్యకథలు విభాగంలో డబ్బు డబ్బు డబ్బు, మూడు కుక్కలు ముఖ్యమైనది. అలాగే ఆంధ్రా దోమల సభ, పాకశాస్త్రం పరీక్ష, నీతిపాఠం కథల్లోని హాస్యం దీక్షితులు హాస్యప్రియత్వాన్ని మన కళ్లకు కడుతుంది. చింతా దీక్షితులు కథల్లో దాసరి పాట ప్రసిద్ధి చెందిన కథ. దాసరి బొబ్బిలి కథ చెబుతుంటే జబ్బుతో ఉన్న అతని కొడుకు చనిపోతాడు. కొడుకు శవాన్ని భుజాన వేసుకుని దాసరి బొబ్బిలి కథను గానం చేస్తాడు. కరుణారస భరితమైనదీ కథ. దాసరిపాట విభాగంలోనిదే మరో కథ 'సుగాలీ కుటుంబం'. రాయలసీమ జీవితాన్ని ప్రతిబింబించిన తొలి కథగా నమోదయ్యింది. సంచార జాతుల మీద రాసిన మొదటి కథ ఇది. లంబాడీల జీవితాన్ని వివరిస్తుందీ కథ. చెంచురాణి కథ కూడా ఈ కోవకు చెందిందే. అలాగే 'అభిప్రాయ భేదం' కథ ఆర్థికంగా సమాజంలో ఉన్నవారికి లేనివారికి మధ్య వున్న అంతరాలను ఎత్తిచూపుతుంది. మన సంప్రదాయాల్ని వదులుకొని అన్యజాతి సాంప్రదాయాల్ని అవలంబించే వారిపై మిసెస్ వటీరావు కథల ద్వారా రచయిత వ్యంగ్య బాణాల్ని సంధించారు. మిసెస్ వటీరావు కథలో 'వటీరావు ఎం.ఎ' పాత్రను సృష్టించి సంప్రదాయాలను కీర్తిస్తూ, ఆధునిక నాగరికతను నిరసిస్తూ చాలా కథలు రాశారు. ఈ విభాగంలో ఇవే కాకుండా గోదావరి నవ్వింది, కిష్కిందలో కోతి, పెద్ద మేడ ముఖ్యమైనవి. గోదావరి జిల్లా పదాలతో పాటు వివిధ మాండలిక పదాలు ఆయన కథల్లో కనిపిస్తాయి. ఈ పుస్తకంలో 'మన్మథ సందర్శనం' అనే కథను రెండు విభాగాల్లో వేశారు. ఒకే కథను ఒకే పుస్తకంలో రెండుసార్లు వేయడం బాగోలేదు.

ఈ పుస్తకంలోని అన్ని కథలూ ఆద్యంతం ఆసక్తికరంగా వుంటాయి. ప్రకృతిలోని ప్రతి అందాన్ని పట్టి చూపిస్తాయి. మనసును ఆర్ద్రతతో నింపుతాయి. సమాజంలోని వివిధ జాతుల జీవన విధానాల్ని పరిచయం చేస్తాయి. దీక్షితులు కథల్లో ప్రకృతితో పాటు ప్రణయం, హాస్యం, తాత్త్విక దృష్టి, పిల్లలను అలరించేవిగా మనకు కనబడతాయి. శిష్ట వ్యవహారికంలో వీరు రాసినా.. అక్కడక్కడ గ్రాంథిక వాసనలు కనిపిస్తాయి. అయినా చదువరులకు ఒక మంచి పుస్తకం చదివామన్న అనుభూతిని కలిగిస్తుందీ కథా సంకలనం.

\- రాజాబాబు కంచర్ల



చింతా దీక్షితులు సాహిత్యం-2
రచయిత : చింతా దీక్షితులు
వెల : 250/-
పేజీలు : 375
ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

1940 వ దశకంలో తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. వ్యవహారిక భాషా ఉద్యమం ఆచరణ రూపం దాల్చిన రోజులు. ప్రజాజీవితాన్ని సాహిత్యంగా మలచి ప్రజాచైతన్యాన్ని కలిగించిన రోజులు, ఆ రోజుల్లో వాడుక భాషలో పుంఖాను పుంఖాలుగా రచనలు చేసి అక్షర జ్ఞాన మున్న ప్రతి ఒక్కరి చేత చదివింపజేసిన నవల ఇది. జంపన చంద్రశేఖరరావు బందరులో పుట్టి తెలుగు ఉపన్యాసకులుగా సినీ రచయితగా, దర్శకుడిగా ప్రఖ్యాతి గాంచారు.

నవ చేతన పబ్లిషింగ్ హౌస్ (విశాలాంధ్ర) వారు "జంపన"నవల పేరుతో 'ఆరు' నవలలను కలిపి మొదటి సంపుటిని తీసుకువచ్చారు. 1942 నుండి 44 వరకు రాసిన ఈ నవలలు ఎక్కువ భాగం మహిళా సమస్యలకు సంబంధించినవి. 'నిర్దోషి' ప్రేమలో వచ్చే అపోహలకు సంబంధించినది. 'కన్నతల్లి' కుటుంబ జీవనంలో వచ్చే అపోహలకు మహిళల కష్టాలకు నిదర్శనం 'ఆహుతి' భార్యను అనుమానించే భర్తల వల్ల వచ్చే

సామాజిక స్పృహ కలిగిన 'జంపన నవలలు'

కుటుంబ కలహాలు 'హారతి' డబ్బు కోసం ఎక్కువ వయసున్న వారికి బాలికలను పెళ్ళి చేయడం. 'పతిత' డబ్బున వాళ్ళ వికృత కృత్యాలకు 'భగ్నజీవి' బాల్య వివాహాల వల్ల వచ్చే సమస్యలకు సంబంధించిన నవలలు అన్ని నవలలు. సులభంగా చదివించేవి.

40వ దశకంలో తెలుగు సమాజం భూ స్వామ్య వ్యవస్థ నుండి పెట్టుబడిదారీ అవస్థకు మారుతున్న రోజులల్లో ఉన్న పరిస్థితులను మన కళ్ళ ముందుంచుతాయి. కొత్త చదువులు, నాగరీకరణ, వ్యవసాయాన్ని చిన్న చూపు చూడటం, కుటుంబాలలో వస్తున్న మార్పులు ఈ నవలల ద్వారా జంపన మన కళ్ళ ముందుంచారు. ముఖ్యంగా స్త్రీ స్వాతంత్ర్యానికి సంబంధించిన చర్చ అన్ని నవలల్లో అంతర్లీనంగా ఉంది. 'జంపన' స్త్రీ అభ్యుదయానికి పట్టం కట్టారు. ముప్పావు శతాబ్దం తరువాత వస్తున్న ఈ నవలలు ఇప్పటికీ సజీవమే. సమాజంలో మంచి సినిమా దర్శకుడిగా పేరు సంపాదిస్తున్న రచయిత చిన్న వయసులోనే మరణించారు.

\-భవిష్య



జంపన నవలలు
రచయిత: జంపన చంద్రశేఖర రావు
వెల :220/-
పేజీలు : 316/-
ప్రచురణ : నవ చేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్



అంగవైకల్యం ఉన్న వారిని సమాజం చిన్నచూపు చూస్తుంది. అన్నీ బాగున్నా మేమే అన్ని పనులనూ చేయలేకపోతుంటే ఇక అవయవ లోపాలున్న వారు ఏం చేయగలరనేది కొందరి మాటల పోట్లు. ఇక ఆటలంటే ఫిట్‌నెస్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఆటలకేమాత్రం పనికిరారనే అపోహలూ లేకపోలేదు. అంగవైకల్యం ఉన్న వారి పట్ల చూపించే చులకన భావానికి, వారేం చేయగలరనే నిట్టూర్పులకీ సమాధానం చెప్పాడు భారత స్టార్ పారా అథ్లెట్ దేవేంద్ర ఝుజారియా.

జావెలిన్‌తో జయించాడు

రాజస్థాన్‌లోని చురు జిల్లాకు చెందిన దేవేంద్ర ఝుజరియా పారా అథ్లెటిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణాన్ని అందించాడు. దేశం పారా క్రీడలకంత ఫేమస్ కాకపోయినా పట్టుదలతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్న పారా అథ్లెట్లున్నారు. వారికి అంతర్జాతీయ స్వర్ణ పతకంతో స్ఫూర్తి నింపాడు ఝుజరియా. ఫ్రాన్స్‌లోని లియోన్ నగరంలో 2013లో నిర్వహించిన ప్రపంచ పారా ఒలంపిక్ పోటీల్లో జావెలిన్ త్రో(ఎఫ్-47) విభాగంలో భారత దేశానికి బంగారు పతకాన్ని అందించాడు. ఝుజారియా ఎనిమిదేళ్ల వయసులో ఓ చెట్టెక్కుతూ తెలీక కరంటు తీగను పట్టుకుని షాక్‌కు గురయ్యాడు. ఆస్పత్రికి చేర్చగా ఎడమ చేతిని పూర్తిగా తొలగించాలని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు నిర్ఘాంత పోయారు. దేవేంద్రలో వయసు పెరుగుతున్న కొద్దీ తన వైకల్యాన్ని ఓడించాలనే కాంక్ష రోజురోజుకీ పెరిగిపోయింది. ఆ అవకాశాన్ని పారా అథ్లెటిక్స్ కల్పిస్తాయని తెలుసుకున్నాడు. 1997లో స్కూల్ స్పోర్ట్స్ డేలో పాల్గొన్న ఝుజారియా ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆర్.డి సింగ్ దృష్టిలో పడి ఆయన కోచింగ్‌ను అందుకోగలిగాడు. క్రీడల్లో మెళకువలు నేర్చుకోడానికి తన నివాసాన్ని కసాబ్ పట్టణానికి మార్చుకోవాల్సి వచ్చింది. తర్వాత పాటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ ఐ ఎస్) లో శిక్షణ పొందాడు. ఇక తన క్రీడా పయనంలో వెను దిరిగి చూసుకోవాల్సి రాలేదు. జావెలిన్ త్రోకు సంబంధించి ఏ పోటీలో పాల్గొన్నా బంగారు పతకాలు అతన్ని వరించేవి. 2002లో కొరియాలో నిర్వహించిన 'ఫార్ ఈస్ట్ అండ్ సౌత్ పసిఫిక్' గేమ్స్‌లోనూ బంగారు పతకాన్ని పొందాడు. ఏథెన్స్‌లో నిర్వహించిన సమ్మర్ పారా ఒలంపిక్ గేమ్స్‌లో 59.77 మీటర్ల తన పాత రికార్డును ఛేదిస్తూ 62.15 మీటర్ల దూరం జావెలిన్ విసిరి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. భారత పారా ఒలంపిక్స్‌లో ప్రథమ స్థానంలో ఉన్న మురళీకాంత్ షేట్కర్ తర్వాతి స్థానంలో చోటు దక్కించుకున్నాడు. ప్రపంచ స్థాయి పోటీలకు కసరత్తు చేసుకునే జఝురియా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. ప్రతికూల పరిస్థితులకు అతను ఏనాడూ తలొగ్గింది లేదు. జీవితంలో తగిలే ఒక్కో ఎదురుదెబ్బకు సమాధానంగా ఒలంపిక్ విజేతగా, ప్రపంచ స్థాయి ఛాంపియన్‌గా నిలదొక్కుకుంటూ ముందుకెళ్లడం నేర్చుకున్నాడు. 2004లో అర్జున అవార్డుతో భారత ప్రభుత్వం ఆయన్ను గౌరవించింది. కెరీర్‌లో పీక్ టైమ్‌లో వరుసగా బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. 2012లో భారత ఉత్తమ పురస్కారం పద్మశ్రీ వరించింది. 2014 ఏడాదికి గాను ఉత్తమ ప్యారా స్పోర్ట్స్ పర్సన్‌గా నిలిచాడు. పారా క్రీడాకారులకు మెయిన్ స్ట్రీమ్ క్రీడాకారులకు లభించినంత ఆదరణ లేదని, క్రీడా ప్రాధికార సంస్థలు, క్రీడా శాఖలు చిన్న చూపు చూస్తున్నాయని ఆ మధ్య నిరసన వ్యక్తం చేశాడు. శిక్షణకు, పోటీల్లో పాల్గొనేపుడు ప్రయాణ ఖర్చులు, అవసరమైన ఏర్పాట్లు తదితరాల విషయాల్లో అన్యాయం, నిర్లక్ష్యం ఎక్కువగా ఉంటోందని తోటి పారా క్రీడాకారుల అవస్థల్ని వెలుగులోకి తెచ్చాడు. ఆటలంటే అంత తేలికేమీ కాదు విజయాన్ని వరించే కొన్ని క్షణాల కోసం క్రీడాకారులు కఠోర శిక్షణతో ఎప్పుడూ మరింత ఉత్తమంగా తమను తాము మలుచుకుంటూ ఉండాలి. పడుతూ లేస్తూ ఉండే కెరీర్‌లో జయాపజయాలను పట్టించుకోకుండా ఒకే లక్ష్యంగా ముందుకు సాగుతారు. "నా దృష్టిలో ఒలంపిక్స్, పారా ఒలంపిక్స్ రెండిటి స్థాయిలో పెద్దతేడా ఏమీలేదు అయితే ఈ క్రీడను ప్రోత్సహించటంలో కొంత ప్రభుత్వ వైఫల్యం ఉంది" అని అంటాడు జఝురియా. క్రీడాకారుల జీతభత్యాలే కాదు వీరికందించే ఫించన్లలోనూ వ్యత్యాసాలు ఉన్నాయి. వ్యత్యాసాలని తగ్గించి పారా ఒలంపిక్ క్రీడాకారులకూ సరైన ప్రోత్సాహం లభిస్తే మరింత మంది క్రీడాకారులు మనదేశం నుండి ప్రపంచ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు మార్గం తేలికవుతుంది.

నినాద నాదం

ఎక్కడైనా మనిషి పుట్టి పుట్టగానే
అగంతకి మతము అంటు కొనగా
నా దేశంలో కులం అంటు కుంటాది!
నా అనుమతి పొందని కులం మచ్చ-
నన్నిదిలించె 'దళితుడా'! అని- అహ్హహ!
నే డప్పుకొట్టి చేయాలట సందడి
చెప్పు కుట్టి పాదసేవయూ చెయ్యాలి
కాని, నిమ్నుడుననే ఛీత్కరింపు గేలి!
నా చెమటతో వాడి భూమి తడిచి పండే
నా శ్రమతో ఊరు స్వచ్ఛమాయె
అయినా ఊరి చివరా నాకు విశిష్ట చెర!
అన్ని పనులూ తెలిసే ఇంత శ్రమా
చేసి-
ఆకలేసి నా వాటా అన్నమడిగితే-
అసమర్థుడన్నారు నాయాల్లు!
సాటి వాణ్ణి దోసుకొనుట సమర్థతా!
ఒక అజ్ఞాని నన్ను తొక్కేయజూసే
ఓ కుయుక్తి పరమతంలో పడేయ
జూసే!
తాజా మాంసం 'నీచు' అయినచో
గొడ్డు క్రొవ్వు 'నెయ్యి' శాఖాహారమా?!
సరే- విడ్డూరమని సరిపెట్టుకుంటాను
చదువు నా ప్రతిభని సానబెడుతుంటే
సర్కారు బడులను మూసేస్తున్నారు
ఇది అన్యాయమని నినదించుతాను!

- జుంజూరు అచ్చిబాబు
8455885272

కవిత్వమ్



కల నిజమవ్వాలంటే

కలలు అందవు
కొలతలకు తూకాలకు-
కళ్ళల్లో అంతర్గత కళ్ళుంటాయి
కలలు కంటూ వుంటాయి
కలల్ని నిజం చెయ్యమని
బహిర్గత కళ్ళను అర్థిస్తుంటాయి!
కట్టెల పొయ్యిని కలగంటాను
మండని కట్టెల పొగలు
అమ్మ కంటిని కమ్ముకుంటాయి
కారే కన్నీరు కట్టెల్ని తడపుతుంటే
నాటి బాధల నేపథ్యం కదలాడుతుంది!
లాంతరు కలగంటాను
అక్షరానికి అక్షరానికి
వెలుగై తిరుగాడుతుంటే
నాటి చదువు ప్రక్రియ గుర్తొస్తుంది!
చెరువును కలగంటాను
గుంపులు గుంపులై వూరంతా
బిళ్ళంగోడు గాలిపటాలు
ఆడిపాడిన ఆటలు జ్ఞప్తిస్తాయి!
కలలు కంటుంటాను
కలలు రేపటి పునాదులు
నిచ్చెనెక్కి ఆకాశంలోకి ఎగబాకుతాను
పామునోట్లో దూరి నేలపై పడిపోతాను
సముద్రంలోకి చెరువంత వల
విసురుతాను
టన్నుల కొద్దీ చాపల్ని వొడ్డుకు తరలిస్తాను
వల తెగి క్రియ చెదిరిందా వలను
నిందించను!
ఆకాశంలోకి పదునైన కత్తిని విసురుతాను
నక్షత్రాలు తెగిరాలితే ఏరుకుంటాను
ఒంటరిగా నేలపై పడితే కత్తిని
నిందించను!
కలలు కంటే సరిపోదు
వెంటాడాలి
అడ్డుకోత పటం గీయాలి
ఆకృతి నిర్మించాలి!
పక్షిలా పైకి ఎగరాలంటే
రెక్కలు కాదు ముఖ్యం
ఆత్మస్థైర్యం-
కల నిజమవ్వాలంటే
రంగులు కాదు ముఖ్యం
దృఢసంకల్పం !

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

కథ

ఆకాశం భోరున వర్షిస్తోంది.. ఆ దంపతుల కన్నీళ్ల వరదలాగా. తుఫాన్ కారణంగా సర్వీసులన్నీ రద్దు చేసినట్లుగా విమానయాన సంస్థ ప్రకటించింది. భరించలేనంత మానసిక ఒత్తిడిలో ఉధృతంగా వచ్చే లావా లాంటి బాధకు ప్రత్యామ్నాయం లేదు. గుండె భారం తగ్గేది కాదు. అయినా సాధ్యమైనంత త్వరగా అయినవాళ్ల మధ్య దుఃఖాన్ని పంచుకుంటే ఓ ఉపశమనం. రిజర్వేషన్ లేకుండా రైలు ప్రయాణం చాలా కష్టం. కారణం ఓ స్థాయికి చేరిన తర్వాత శరీరం సౌకర్యాన్నే కోరుకుంటుంది. పెయిడ్ టాక్సీ బస్టాండ్ వైపు బయలుదేరింది. లగేజి ఏమీ లేదు. హ్యాండ్ బ్యాగ్, ల్యాప్‌టాప్ తప్ప.

గర్భశోకం ఎవ్వరికీ రాకూడని శాపం. బిడ్డలు లేకపోతే ఆ తీరు వేరు. కణం పిండంగా చేరిన క్షణం నుంచి పేగుబంధం తల్లిది. రక్తసంబంధం తండ్రిది. మా వంశాంకురం అన్న భావన అందరిదీ. శిశుజననం, పెంపకం

విష వలయం

- డా॥ శమంతక మణి
9491962638

లోని మాధుర్యం స్వానుభవమైన తరువాత శాశ్వత దూరాన్ని భరించడం అంటే బ్రతికుండీ చనిపోవడంతో సమానం. రవి, శశిలది ఇప్పుడే అదే స్థితి.

బస్సులో సీట్లు దొరికాయి. వాటర్ బాటిల్ తప్ప మరేదీ కొనలేదు. కారణం ఆకలి, ఆశ మరచిపోయి ఆరు గంటలయ్యింది. తిరిగి పుడతాయన్న ఆశ కూడా లేదు. హృదయంలో సుడులు తిరుగుతున్న దుఃఖానికి శరీరంలో ఆకలి ఉంటుందా?

బస్సు బయలుదేరింది.

అప్పటికే చాలా సేపటి నుంచి ఏడుస్తున్న శశికి తలనొప్పితోపాటు వాంతులు కూడా ప్రారంభమయ్యాయి. బిడ్డ కనపడకుండా పోయిన దుఃఖం, భార్య అనారోగ్యం రవిని అతలాకుతలం చేస్తోంది. జంటగా సృష్టించిన సుందర శిల్పం జాడలేకుండా కొట్టుకుపోయిందన్న ఆవేదన ఆగ్రహంగా మారి చాలా సేపయ్యింది. తన కోపం వలన బిడ్డ తిరిగి వస్తుందా? శశి పైకి ఏడుస్తోంది. రవి హృదయం దుఃఖంతో రగులుతోంది.

•••

“అమ్మా! నాన్న వచ్చేసరికి స్వీట్ చెయ్యి, నేను ఇల్లు డెకరేట్ చేస్తాను.” కొడుకు ఉద్యోగస్తుడైన విషయాన్ని భర్తకు ఎంత తొందరగా చెప్పాలా? అన్న ఆత్రంగా వున్న హైమావతితో అన్నాడు రవి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కట్టుకున్న చిన్న ఇల్లు. అందమైన పెరడు. సంతోషానికి ప్రతీకగా వుండే సంబంధ బాంధవ్యాలు. తరచూ ఇంటిని రకరకాలుగా అలంకరించడం రవికున్న హాబీ. “ఎందుకురా నీకు ఆ పని?” అంటే... “ఇల్లు మారదు కదమ్మా. ఇంటీరియర్ మారితే మూడ్ కూడా మారుతుంది” అంటాడు.

గులాబ్‌జామ్, పకోడి చేసి చేయి కడుక్కుంటున్న ఆమెకు భర్త స్కూటర్ శబ్దం వినిపించింది. కాఫీ తరువాత పెట్టవచ్చు అనుకుంటూ గబగబా ముందు గదిలోకి ఎదురెళ్ళింది. రవి ఫోన్లో పంపిన మెసేజ్ వలన ఎప్పుడెప్పుడు ఇంటికి వద్దామా అన్న ఆత్రంలో వున్న శ్రీరాములు దారిలో కొడుకు కోసం ఒక కొత్త మొబైల్ కొని తెచ్చాడు.

సంతోషంతో కళకళలాడుతూ ఎదురొచ్చిన భార్య కళ్ళపై ముద్దాడాలనిపించినా, పెళ్ళీడుకొచ్చిన కొడుకు ముందు సభ్యత కాదని తమాయించుకున్నాడు. ఆనందంగా తండ్రిని కౌగలించుకున్నాడు రవి. ట్రైనింగ్ ఎక్కడ? కొడుకు నుదురు ముద్దాడుతూ అడిగాడు శ్రీరాములు.

“మైసూర్‌లో! 18 నెలలు. స్టైఫెండ్ నెలకి రు. 20,000/- లు. ఈ నెలాఖరుకు ప్రయాణం. మీరు వచ్చిన తరువాత రిజర్వేషన్ చేయిద్దామని ఆగాను. తండ్రి నుండి విడివడి తల్లి అందించిన స్నాక్స్ తీసుకున్నాడు.

తొలి జామూన్ తల్లికందించి రెండవది తండ్రి నోట్లో పెట్టాడు. లేక లేక కలిగిన సంతానం. ఆర్థిక బాధలు, అత్యాశలు లేని మధ్యతరగతి కుటుంబం.

"కాఫీ ఫ్రెండ్స్‌తో తాగుతానమ్మా" అంటూ బయటకు బయలుదేరాడు రవి. గేటు వేసిన చప్పుడు విన్న శ్రీరాములు భార్య ఒడిలో తల పెట్టుకుని కాళ్ళు సోఫాలో బార్లా జాపాడు. ఆయన నుదుటి మీద చప్పుడు లేకుండా ముద్దాడింది హైమావతి. ఆప్యాయత, అనురాగం తప్ప అనవసర వాగ్వివాదాలు లేని దాంపత్యం వారిది.

"ఏవండీ... మనకి వయసు అయిపోయింది. రవికి పెళ్ళిచేస్తే త్వరగా తాత, నానమ్మలం అవ్వొచ్చు. సంబంధాలు చూద్దామండి." భర్త తల నిమురుతూ అన్న హైమావతి మొహంలోకి చూస్తూ, "మనకా శ్రమెందుకు? ట్రైనింగ్‌లో ఎవరినైనా చూసుకోమందాం" అన్నాడు శ్రీరాములు.

సంబంధాలు కలుపుకునేటప్పుడు అటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలు అన్నది నిన్నటి మాట. సమానమైన చదువు, సంపాదన స్థాయిలను పరిగణనలోనికి తీసుకొని జంటలు అవుతున్నారు నేటి కాలంలో. ఇదొక శుభ పరిణామం.

•••

రవిని రైలెక్కించిన సమయంలో గుండె బరువెక్కినా వెళ్ళేది ఉద్యోగానికే కాబట్టి కన్నీళ్ళు రానివ్వలేదు ఆ దంపతులు. శ్రీరాముల గారి మాట నిజం చేస్తూ శశికళ ఆ ఇంటికి కోడలిగా వచ్చింది. కన్నడ రాష్ట్రంలో పుట్టిన మరాఠీ బిడ్డ. ఆమె కుటుంబంలో కూడా అభ్యంతరాలు లేకపోవడం వల్ల బిడ్డల సంతోషం తప్ప, మరేమీ ఆశించని దంపతులు సంతోషంగా ఆశీర్వదించారు.

తమకు వివాహమైన చాలా కాలానికి రవి పుట్టడం వలన కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించవద్దని, బిడ్డలు పుడితే తాము సాకుతామని, రవి, శశి ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళుతున్న సందర్భంలో చెప్పారు హైమావతి దంపతులు.

కొత్త కాపురం. ఆర్థిక యిబ్బందులు లేకపోవడం, ఆనందంగా వున్న ఆ కుటుంబంలోకి 2వ సంవత్సరంలోనే "శౌర్య" వచ్చింది. ప్రసవం కష్టమైన శశికి సిజేరియన్‌తోపాటుగా గర్భసంచి కూడా తీసివేయవలసి వచ్చింది. శశికి ఆ విషయం తెలియకుండా జాగ్రత్తపడ్డారు ఆ కుటుంబమంతా.

•••

భుజం మీద వాలిపోయిన శశిని మరింత దగ్గరగా తీసుకున్నాడు రవి. కారణం ఆరిపోయిన ఇంటి దీపంతోపాటు తమకు తిరిగి సంతానం పొందే అవకాశం లేకపోవటం. ఎలా ఓదార్చగలడు భార్యని. ఏమి చెప్పి సముదాయించగలడు? మాటలు రాని సమయంలో స్పర్శే అతి పెద్ద కమ్యునికేషన్ .

•••

శౌర్య పుట్టిన వెంటనే శ్రీరాములు దంపతుల ఆనందానికి హద్దులు లేవు. కారణం ఎన్నో సంవత్సరాల తరువాత తమ ఇంట ఓ ఆడపిల్ల. పసిపాపల బోసినవ్వులు, బోర్లాపడి లేవడాలు, వచ్చీరాని మాటలు, ఈమధ్యే రిటైరైన శ్రీరాములు కాలక్షేపానికి లోటులేకుండా మనుమరాలు. మోకాళ్ల నొప్పులు భారం అనిపించడం లేదు హైమావతికి. కారణం కొడుకు, కోడలు షిఫ్ట్ డ్యూటీలతో, పసిబిడ్డతో ఇబ్బందులు పడకూడదన్న ఆలోచన. హైదరాబాద్ రమ్మని రవి, శశి పిలిచినా, ఆ దంపతులు అంగీకరించలేదు. కారణం సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో తమ బిడ్డలు సుఖంగా ఉండాలన్నది ఓ కారణం కాగా, చుట్టూ పెరడున్న ఇంటిలో మనుమరాలు ఆడుకోవడానికి అవకాశాలు ఎక్కువని. అందుకే వీలు కుదిరినప్పుడు మీరే రమ్మని శౌర్యను వారే పెంచసాగారు. హాయిగా సాగిపోతోంది కాలం.

శౌర్యని తమ వద్ద హైదరాబాద్‌లో స్కూలులో చేరుద్దామనుకున్న రవి, శశిల ఆలోచనను భగ్నపరుస్తూ కంపెనీ తరపున ఇద్దరు లండన్‌లో మూడేళ్లు కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. ప్రైవేటు ఉద్యోగాలు. ఎప్పుడైనా ఫైర్ చేసే అవకాశమున్న కాలం. అందుకే వచ్చిన అవకాశాన్ని వదులుకోవడం ఎందుకని, మెరుగైన సంపాదనకై వెళుతూ శౌర్యను తమ ఊరిలోనే స్కూలులో చేర్చారు.

హైమావతి దంపతులకు గతంలో వున్నంత ఆరోగ్యం లేదు. శశి తల్లిదండ్రులు కూడా కాలం చేయడం శౌర్యను మరెక్కడా వదిలేసే అవకాశం లేదు. తప్పనిసరి పరిస్థితి.

రవి, శశి బాగానే సంపాదించుకుని స్వదేశం చేరారు. వేసవి సెలవుల అనంతరం తమ వద్దకు శౌర్యను తీసుకువచ్చేసి చదివించాలని, తల్లిదండ్రికి రిలీఫ్ ఇవ్వాలనుకున్న సమయంలో ఈ వార్త.

•••

ఓ నేషనల్ ఛానెల్‌లో టి.వి.లో చర్చలు వాడిగా వేడిగా జరుగుతున్నాయి.

"ఇది మీ తప్పుకాదంటారా? సూటిగా ప్రశ్నించాడు విలేఖరి."

"ముమ్మాటికీ కాదు. ప్రభుత్వం అంటే జాతీయస్థాయిలో ఎన్నో సమస్యలుంటాయి. అంతర్జాతీయంగా రూపాయి విలువ పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు పెరగడానికి అనేకానేక కార్యక్రమాలు చేపట్టాలి. మీరు చెప్పింది స్థానిక సమస్య. అది ఆ రాష్ట్ర ప్రభుత్వం చూడాలి." అధికారంలో వున్న జాతీయ పార్టీ ప్రతినిధి.

"అంటే ఇది మీ బాధ్యత కాదని తప్పించుకుంటారా? ఇది మీకేమి సంబంధం లేదా? స్మార్ట్ సిటీలను ప్రకటించింది. పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాల్సింది మీరే కదా? అడిగాడు విలేఖరి."

"స్మార్ట్ సిటీలను ప్రకటించాం. నిజమే. మీరు చెబుతున్న నగరం కూడా అందులో వున్నమాట వాస్తవం. నేను ముందే చెప్పినట్లుగా ఇది స్థానిక సమస్య. నిధులు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గమనించాలి. దీనిలో కేంద్ర ప్రభుత్వానికి ఏం సంబంధం లేదు."

"బొంబాయి నుండి లైనులో వికాస్ మాట్లాడుతున్నారు. ఆయన ఏం చెప్తారో విందాం"... విలేఖరి.

"సర్, నాదొక సూటి ప్రశ్న. స్థానికంగా మేం టాక్స్‌లన్నీ సక్రమంగా కడుతున్నప్పుడు మాకు మంచి రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, మంచినీళ్లు యివ్వటం మీ బాధ్యత కాదా? యిప్పుడు ప్రాణంపోయిన చిన్నారి కుటుంబానికి మీరేం సమాధానం చెబుతారు?"

"చెప్పండి... ప్రభుత్వాన్ని, ప్రజల తరపున వికాస్ అడుగుతున్న ప్రశ్న. మేం టాక్స్‌లు కడుతున్నాం. వాటి నిధులు ఏమయ్యాయి?" అని అడుగుతున్నారు! పునరుద్ఘాటించాడు విలేఖరి.

"విద్య, వైద్యం ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించాల్సిన విషయంలో కేంద్రంలో వున్న ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నిన్న జరిగిన సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పట్టణాభివృద్ధి శాఖా మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి." ప్రతిపక్షం ప్రతినిధి ఎత్తుకున్నాడు.

"ఇలా ప్రతి చిన్న సంఘటనకు రాజీనామా చేయటం మినహా, ప్రభుత్వానికి పనేమీ లేదా? అమ్మాయిని బాధ్యతారాహిత్యంగా వదిలేసిన ఆ కుటుంబానిదే బాధ్యత." నిర్లజ్జగా దేశమంతా చూస్తున్న సమయమని మరచిపోయి మాట్లాడాడు అధికార ప్రతినిధి.

"చాలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు. డ్రైనేజీలో కొట్టుకుపోయి చనిపోయిన బిడ్డ మీ మనుమరాలైతే ఇదే సమాధానం ఇస్తారా?" డిస్కషన్‌లో పాల్గొంటున్న ఓ సోషల్ వర్కర్.

"మీ స్వచ్ఛంద సంస్థలన్నీ ఏమి చేస్తున్నాయి? ఎలా జాగ్రత్తలు తీసుకోవచ్చో ప్రజలకు చెప్పొచ్చుగా." అడిగాడు అధికార ప్రతినిధి.

"మేము జాగ్రత్తలు చెప్పాల్సింది, ప్రశ్నించాల్సింది మిమ్మల్ని. స్థానిక సంస్థల నిధులను ఏమి చేస్తున్నట్లు? వదలలేదా సోషల్ వర్కర్.

"సమస్యలొచ్చినప్పుడు స్థానిక కాంట్రాక్టర్లు బాగుచేస్తూనే వున్నారు. సక్రమంగా చేయనప్పుడు ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజలది. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించే స్థానిక అధికారులు కూడా బాధ్యులే." అధికార ప్రతినిధి సమాధానం.

"ప్రధాని విదేశీ పర్యటనకయ్యే ఖర్చుతో పోలిస్తే దేశవ్యాప్తంగా వున్న డ్రైనేజి వ్యవస్థను

బాగుచేయడానికయ్యే ఖర్చు తక్కువని మీకు తెలియదా?" విపక్ష నేత సంధించాడు మరో ప్రశ్న.

"యస్. దీనికి మీ సమాధానం చెప్పండి. దేశ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఎప్పుడూ విదేశాల్లోనే అధికారికంగా తిరుగుతున్నారని ప్రజలంతా భావిస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి?" అడిగాడు విలేఖరి.

"ఇది అన్యాయమైన ఆరోపణ. అంతర్జాతీయ పటంలో మనదేశ కీర్తిప్రతిష్ఠలు పెంచాలి. పెట్టుబడులు రప్పించాలి. అప్పుడే ఈ దేశ యువతకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువవుతాయి. అయినా దాదాపు అన్ని రాష్ట్ర ముఖ్యమంత్రులు అధికారికంగా ఏదో దేశాన్ని పర్యటిస్తూనే వున్నారు. మీరాష్ట్ర ముఖ్యమంత్రి అయితే యిప్పటికి 68సార్లు వెళ్ళివచ్చారు. అది ప్రజాధనం కాదా? వృథా అని మీరు భావించటం లేదా? వారినెందుకు ప్రశ్నించరు? ఎదురుదాడి ప్రారంభించాడు అధికార ప్రతినిధి."

"అదే... అదే మేము అడుగుతున్నది. ప్రజలు మిమ్మల్ని గెలిపించింది మెరుగైన సౌకర్యాలు ఇవ్వడానికి. జీవన ప్రమాణాలను పెంచడానికా లేక మీ జీవితాలను, మీ అనుయాయులను బాగుచేయడానికా?" తిప్పికొట్టాడు విపక్షనేత.

"మీ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు మీ నాయకుడు ఎక్కడెక్కడ పర్యటించాడో, ఎంత ఖర్చయిందో అధికారిక లెక్కలు మాదగ్గరున్నాయి". తిరుగు సమాధానం ఇచ్చాడు అధికార ప్రతినిధి.

"దయచేసి విషయాన్ని డైవర్ట్ చేయకండి. ప్రశ్న ఏమిటంటే, అన్ని స్థాయిల్లోని మంత్రుల విదేశీ పర్యటనలకు దుర్వినియోగం చేస్తున్న ప్రజాధనాన్ని డ్రైనేజిలో పోస్తూ, ప్రజలకు సరైన డ్రైనేజి వ్యవస్థను కల్పించకపోవడమే శౌర్య కనిపించకపోవడానికి కారణమంటున్నారు." దీనికి మీ సమాధానం. అడ్డుపడ్డాడు విలేఖరి.

"శౌర్య కనిపించకపోవడానికి మేమెలా కారణమవుతాము? కన్నబిడ్డని ముసలి తల్లిదండ్రుల వద్ద వదిలిన ఆ దంపతులది కాదా?"

"మనుమరాలని తమ వద్ద ఉంచుకుని చదివించుకోవటం తప్పంటారా?"

"నిస్సందేహంగా తప్పే. వృద్ధాప్యమంటే వేరొకరిపై ఆధారపడే వయసు. ఒక వయసు దాటాక, పిల్లల్ని పెంచలేని స్థితి. ప్రకృతే ఆ నియమం ఏర్పరిచింది. సొంత తల్లిదండ్రులైనా వృద్ధుల వద్ద తమ బిడ్డల్ని వదలకూడదు. సంపాదన యావలోపడి ఒక్కగానొక్క ఆ బిడ్డను వదిలేసిన ఆ దంపతులదే తప్పు."

"ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేని స్థితిలో ఉంటే, ఎప్పుడు ఊడిపోతుందో తెలియని ఉద్యోగాలు చేసుకుంటున్న షిఫ్ట్ డ్యూటీస్ భార్యాభర్తలను నిందించటం ఏమి మానవత్వం? ఆక్రోశించాడు సోషల్ వర్కర్."

"ధరల నియంత్రణ, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. రైతుల ఆత్మహత్యలు రోజురోజుకీ పెరిగిపోవడానికి కారణం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యమే." గట్టిగా అన్నాడు విపక్షనేత.

"శౌర్య కనిపించకపోవడానికి కారణం అస్తవ్యస్త డ్రైనేజి వ్యవస్థ కాదా? మిత్రులారా! ఈ కార్యక్రమాన్ని చూస్తున్న మీరంతా మీ ప్రాంతంలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలను, తెరచివున్న మ్యాన్ హెూల్స్‌లను మాకు వాట్సప్‌లో పంపించండి. ఈ సమస్యను పరిష్కరించడానికి మా ఛానెల్ మీ అందరి తరపున పోరాడుతుంది. ఇదో దేశ వ్యాప్త ఉద్యమంగా నడుపుదాం. యువర్ టైమ్ స్టార్ట్స్ నౌ.... యిప్పుడే పంపండి."

"ఇదిగో జర్నలిస్ట్. ఏంటయ్యా... ఏంటా దూకుడు? ఇది కేవలం ఓ చర్చ మాత్రమే? ఉద్యమం అంటే మాకేమన్నా భయం అనుకున్నావా? ఏ ఉద్యమాన్ని ఎలా అణచాలో మాకు తెలుసు. అయినా స్థానికంగా అందరూ వెదుకుతున్నారు. డ్రైనేజి సముద్రంలో కలిసిన కారణంగా నేవీలు సైతం రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టాం." విసురుగా అన్నాడు అధికార ప్రతినిధి.



"తాగడానికి, ఉచిత తిండి తినడానికి మిలటరీ సర్వీసుల్లో చేరతారని అన్న మీరు నేవీని ఎలా ఉపయోగిస్తారు? డ్రైనేజి వ్యవస్థనే బాగుచేయించలేని మీరు ఈ దేశాన్ని ఏమి పాలిస్తారు?" అడిగాడు సోషల్ వర్కర్.

"ఇదిగో సోషల్ వర్కర్... మరలా చెబుతున్నాను. పిల్లల్ని, వృద్ధుల దగ్గర వదిలేసిన శౌర్య తల్లిదండ్రులదే తప్పు. ముసలితనంలో కళ్ళు కనబడనప్పుడు బిడ్డల్ని జాగ్రత్తగా చూసుకోలేకపోవడం ఆ వృద్ధులది తప్పు. కడుతున్న ట్యాక్స్‌లు ఏమౌతున్నాయని స్థానిక అధికారులను అడగకపోవడం ప్రజలది తప్పు. కాంట్రాక్టర్లు నాసిరకం పనులు తమ కళ్ళ ముందే చేస్తున్నప్పుడు ప్రశ్నించకపోవడం చుట్టుప్రక్కల వున్న జనం తప్పు. మ్యాన్‌హెూల్స్, డ్రైనేజి ఎలా ఉపయోగించాలో ప్రజల్లో చైతన్యం తీసుకురాకపోవడం మీ స్వచ్ఛంద సంస్థల తప్పు. ఉద్యోగులతో పనిచేయించడానికే మేమున్నాం. అందుకే నేవీని రంగంలోకి దింపాం. మా పని మేము చేస్తున్నాం. శౌర్య మరణానికి కారణమైన దోషులెవరో తెలియగానే చట్టం తన పని తాను చేసుకుంటుంది. మీడియా ముందు అతిగా ఆవేశపడకు. తర్వాత మీ స్వచ్ఛంద సంస్థ తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది". ఎర్రబడ్డ కళ్ళను దేశప్రజానీకం చూస్తుందన్న స్పృహ కలిగిన ఆ అధికార ప్రతినిధి ఎదురుగా వున్న మంచినీళ్ల గ్లాసు అందుకున్నాడు.

"చూశారుగా మిత్రులారా... ఇది ఈ రోజు మన ప్రైమ్ టైం చర్చ. అందరి సమాధానాలు విన్న మీరే నిర్ణయించండి. తప్పెవరిదో? ప్రజా సమస్యల పట్ల స్పందనలేని ప్రభుత్వాలను ఎన్నుకొన్న ప్రజానీకానిదా? లేక ప్రశ్నించడానికి వీలునివ్వని వ్యవస్థదా? ఆలోచించండి. శౌర్య బ్రతికుందన్న ఆశ లేదు కాబట్టి కనీసం ఆ పాప బాడీ అయినా దొరకాలని ఆశిద్దాం. సీ యూ టుమారో."

•••

"తాతయ్యా! ఈ వర్షంలో మీరు రావొద్దు. సందుచివరేగా ట్యూషన్ నేను వెళతాను" అంటూ వెళ్ళిన తమ మనుమరాలి ఆచూకీ ఏ క్షణానైనా తెలుస్తుందేమోనని బూజుకళ్లతో టి.వి.నే చూస్తున్న హైమావతి, శ్రీరామ్‌ల దంపతులకు అసలు ఈ దేశంలో పుట్టడమే తాము చేసిన తప్పేమో అనిపించింది.

ఇదేమీ తెలియని రవి, శశిల ప్రయాణం క్షణమొక యుగంగా సాగుతోంది.

ఈ విషవలయానికి అంతమెప్పుడు?

చల్ల... చల్లగా....

మ్యాంగో ఐస్ క్రీమ్

కావాల్సిన పదార్థాలు

క్రీమ్ -230 గ్రాములు
పాలు -500 మి.లి
పంచదార - 150 గ్రాములు
మామిడి గుజ్జు 250 గ్రాములు
స్కిమ్డ్ మిల్క్ పౌడర్ (వెన్నతీసిన పాల పొడి) - 50 గ్రాములు

తయారుచేసే విధానం

ముందుగా మిల్క్ బాయిలర్‌లో పాలు పోసి స్టౌ మీద పెట్టి మరగనివ్వాలి. మరొక గిన్నెలో పంచదార, స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ని తీసుకుని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో నెమ్మదిగా వేస్తూ బాగా కలపాలి. తర్వాత పాల మిశ్రమంలో క్రీమ్ కూడా వేసి కొద్దిసేపు కలపాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి గిన్నెలో నీళ్ల పోసి, చిక్కబడిన పాల మిశ్రమాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. ఎంత బాగా చల్లారితే ఐస్ క్రీమ్ అంత మృదువుగా ఉంటుంది. పాల మిశ్రమం చల్లారాక మామిడి గుజ్జు వేసి కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి 15 నిమిషాలు బ్లెండ్ చేసుకోవాలి. తర్వాత ఐస్‌క్రీమ్ కప్పుల్లో లేదా ఒక పాత్రలో బ్లెండ్ చేసిన మిశ్రమాన్ని పోసి, డీప్ ఫ్రిజ్‌లో పది గంటలు ఉంచాలి. తర్వాత ఫ్రిజ్‌లో నుండి ఐస్‌క్రీమ్ కప్పుల్ని బయటకు తీసి మామిడి ముక్కలతో అలంకరించి వచ్చిన అతిథులకు సర్వ్ చేయండి.

వెనిల్లా ఐస్ క్రీమ్

కావాల్సిన పదార్థాలు

పాలు - 1 1/2 లీటర్
పంచదార - 1 కప్పు
క్రీమ్ - 15 మి.లి
గుడ్లు - 6 (పచ్చ సొన మాత్రమే)
వెనిల్లా ఎసెన్సు - 1/2 టీ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా పాలను ఒక పాత్రలో వేసి చిక్కగా అయ్యేంత వరకు కాగపెట్టాలి. పాలు చల్లారిన తర్వాత అందులో గుడ్లలోని పచ్చసొన, పంచదార వేసి బాగా కలపాలి. పంచదార బాగా కరిగే వరకు గిలకొట్టాలి. ఇప్పుడు ఈ మిశ్రమంలో చల్లారిన పాలను కొద్ది కొద్దిగా పోస్తూ కలుపుకోవాలి. ఒక పెద్ద పాత్ర తీసుకుని అందులో నీళ్ల పోసి సన్నని సెగమీద మరిగేప్పుడు అందులో మరి కొన్ని పాలు పోయాలి. మరిగిన పాలలో ముందుగా సిద్ధం చేసుకున్న గుడ్డు మిశ్రమాన్ని పోసి కలుపుతూ అది చిక్కబడే వరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత క్రీమ్, వెనిల్లా ఎసెన్సు వేసి బాగా కలిపి ఐస్ క్రీమ్ మోల్డ్ లో పోసి ఫ్రిజ్‌లో పెట్టకోవాలి. బాగా గట్టి పడిన తర్వాత ఫ్రిజ్‌లో నుండి తీసి వెనిల్లా ఐస్‌క్రీమ్‌ని పిల్లలకు అందించండి.

క్యారెట్ ఐస్‌క్రీమ్

కావాల్సిన పదార్థాలు

క్యారెట్ జ్యూస్ - 2 కప్పులు
పాలు - 2 కప్పులు
పంచదార- 2 కప్పులు
క్రీమ్ - 1 కప్పు
బాదం పప్పు- 4 టేబుల్ స్పూన్లు
పిస్తా పప్పు - 4 టేబుల్ స్పూన్లు
మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

పాలలో చక్కెర వేసి కలిపి స్టౌ మీద పెట్టి వేడి చేయాలి. కొద్ది పాలలో మొక్కజొన్న పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమంలో మరికొన్ని పాలను పోసి చిక్కగా అయ్యేవరకు ఉంచాలి. పాలు చిక్కగా అయ్యాక క్రీమ్ వేసి కలపాలి. పది నిమిషాలు మరగనిచ్చి అందులో క్యారెట్ జ్యూస్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం మరింత చిక్కగా అయ్యే వరకు మరిగించి దించేసుకోవాలి. మిశ్రమం పూర్తిగా చల్లారాక మిక్సీలో బ్లెండ్ చేసుకోవాలి. తర్వాత చిన్న కప్పుల్లో ఈ మిశ్రమాన్ని ఉంచి డీప్ ఫ్రిజ్‌లో ఉంచాలి. గంట తర్వాత బైటికి తీసి ఐస్ క్రీమ్ పై బాదం, పిస్తాలను ఉంచి వేసవిలో వచ్చే అతిథులకు క్రీమ్‌ని అందించండి.



ఎక్కడుందో?

పిల్లలూ! మీకు అందర్నీ నవ్విస్తుండే జోకర్ అంటే బాగా ఇష్టం కదా! అందుకే మీ కోసం ఒక జోకర్ చిత్రాన్ని ఇస్తున్నాం. అయితే, ఈ చిత్రంలో బుద్ధిగా చదువుకుంటున్న ఓ అమ్మాయి కూడా ఉంది. ఎక్కడుందో మీరే కనిపెట్టాలి.. సరేనా.!



తేడాలు గుర్తించండి

ఈ రెండు చిత్రాలు ఒకేలా ఉన్నా ఇందులో ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టేయండి.



దారి కనుక్కోండి



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేను క్రికెట్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

పూరించండి

మనం ప్రయాణాల్లో వాడే కొన్ని వాహనాల బొమ్మలు ఇక్కడ వున్నాయి. అయితే వాటి పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయ్యాయి. మీరు చేయాల్సిందల్లా మిస్సయిన అక్షరాలను పూరించడమే. పిల్లలూ మీకు వాటి పేర్లు తెలుసు కదా! ఇక ఆలస్యం చేయకుండా వెంటనే అవేంటో రాసేయండి.

	PL_N_
	_IK_
	_O_T
	B_ _
	M_TO_B_K_
	C_R

జ: aeroplane, bike, boat, bus, motor bike, car

నీడ గుర్తించండి

పిల్లలూ! ఇక్కడున్న నీడల్లో పైనున్న ఆక్టోపస్ సరైన నీడను గుర్తించండి.





బొమ్మ గీద్దాం

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం బాతు బొమ్మను ఎలా గీయాలో నేర్పుతాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండే.



బన్నీ పెన్సిల్ స్టాండ్



పిల్లలూ! మీరు ఐస్‌క్రీమ్ పుల్లలు, షాంపు బాటిల్స్ ఇలా రకరకాల వస్తువులతో పెన్సిల్ స్టాండ్‌ని తయారు చేసే ఉంటారు. వీటిని మీకు నచ్చిన జంతువు ఆకారాల్లో కూడా తయారు చేసుకోవచ్చు. కుందేలు ఆకారంలో ఉండే బన్నీ పెన్సిల్ స్టాండ్ ఎలా తయారు చేసుకోవచ్చో మీకు మేం నేర్పిస్తాం! జాగ్రత్తగా తయారు చేయండే!

కావాల్సిన వస్తువులు

కన్‌స్ట్రక్షన్ పేపర్, కత్తెర, గమ్, స్కెచ్ పెన్

తయారుచేసే పద్ధతి

మీకు నచ్చిన రంగుల్లో కన్‌స్ట్రక్షన్ పేపర్‌ని ముందుగా సిద్ధం చేసుకోండి. దాన్ని గుండ్రంగా చుట్టి ఒక వృత్తంలా ఏర్పడ్డాక గమ్‌తో చివరి భాగాన్ని అతికించండి. తర్వాత మరో కన్‌స్ట్రక్షన్ పేపర్ తీసుకుని కుందేలు చెవులు, ముక్కు, కళ్ల ఆకారాలను గీసుకుని కత్తెరతో జాగ్రత్తగా కట్ చేయండి. ఒకే రంగు కాగితంతో కాకుండా వేర్వేరు రంగులున్న కన్‌స్ట్రక్షన్ పేపర్లతో వీటిని తయారు చేసుకోవాలి. ఇప్పుడు కట్ చేసి పెట్టిన చెవుల భాగాన్ని స్టాండ్ పైభాగంలో అతికించాలి. తర్వాత ముక్కు, కళ్ల భాగాలను కూడా జాగ్రత్తగా అతికించాలి. కళ్లకి ఒకే రంగు వాడాలి. మరో కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై మీరు ఎన్ని స్టాండ్లను తయారు చేసుకున్నారో లెక్క పెట్టి అన్ని వృత్తాలను గీయాలి. వాటిని కత్తెరతో కత్తిరించి స్టాండ్ అడుగు భాగంలో అతికించాలి. రెండు మూడు వృత్తాలను కలిపి కూడా అంటించవచ్చు. ఇక మీకు నచ్చిన డిజైన్‌లతో వాటిని అలంకరిస్తే బన్నీ పెన్సిల్ స్టాండ్ రెడీ!

పదవికాసం - 10

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		■	3		■	4		■
5		■	6		■	7		■	8
	■	9		■	10		■	11	
■	12		■	13		■	14		
15		■	16				■	17	
18		19		■		■	20		■
	■	21		22	■	23		■	24
■	25		■	26	27	■	28	29	
30				■	31	32			■
33			■	34	■		■	■	35

ఆధారాలు

అడ్డం

1. అమ్ముకునేవాడు (3)
3. ఏకై వచ్చి -- అవుతారు కొందరు (2)
4. దిక్కు, వంపు, సాకు (2)
5. ము లేని జనుము (2)
6. బీగం (2)
7. దుముకు (2)
9. పాట, గీతం (2)
10. చక్కదనం, సౌందర్యం (2)
11. తారుమారైన బేరం (2)
12. నలుపు (2)
13. రెండు (2)
14. నలుగు పెట్టుకో నాద్కల్యాణి 1,3,8 (3)
15. దారి మార్చిన నటి (2)
16. అందంగా అమర్చడం (4)
17. అల్జీమర్ మొదట్లో లేదు (2)
18. అల్లరి నరేష్, షర్మిలా మండ్రె, దేవిప్రసాద్ కాంబినేషన్లో 2013లో వచ్చిన కామెడీ సినిమా (4)
20. ఖర్చు (2)
21. చెరువు (3)
23. అటు నుంచి హాలు (2)
25. నిలుపు (2)
26. 1992లో వెంకటేష్, మీనా, 2004లో రవితేజ, చార్మి నటించిన సినిమా (2)
28. పూల---. ఏఎన్నార్ సినిమా (3)
30. ఏభై + అరవై (4)
31. గోదావరి నీటి ఆధారంగా నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టు (4)
33. అటునుంచి అలుక (3)
34. జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే పేర్లలో తొలి ఆంగ్ల అక్షరం (1)
35. అడ్డం 34తో కలిపి ఆంగ్ల అక్షరమాలలో ఆఖరుది (1)

నిలువు

1. గెలుపు (3)
2. కొంగ, బరువును ఎత్తి దించే యంత్రం (2)
3. వాయిద్యాల కూడిక (2)
4. భాగం (2)
6. రాగం -- పల్లవి (2)
7. చందనం (2)
8. మన రాజ్యాంగ నిర్మాత (4)
9. చేపలు పట్టే సాధనం (2)
10. ఆకాశం (4)
11. ల లేని రంగులమయం (4)
12. మీనవ్వులు ఏకవచనం (3)
13. ఆదాయం, రాబడి (2)
15. రైలెక్కే ముందు తీసుకునేది (3)
16. అయ్యో (3)
19. దేశంలో ఎన్నికలు నిర్వహిస్తున్న ఐదు రాష్ట్రాల పేర్ల మొదటి అక్షరాలు (5)
20. గజిబిజి వ్యవహారం (4)
22. పళ్లెం, భోజన పాత్ర (2)
24. సన్నచెక్క (2)
25. క్రీడలు (3)
27. కింది నుంచే పోటీ (2)
29. వేడి (2)
30. నూకలు మూడింట రెండొంతులు (2)
32. సోలో పాటల్లో తాజాగా గిన్నిస్ బుక్‌లో స్థానం పొందిన తెలుగు సినీ గాయని పేరులో చివరి అక్షరాలు కింది నుంచి (2)

సుడోకు

			6			8		
6	1			3	2	4		
2			1	9	4	7		
1			2				8	7
	7	5	9		1	2	4	
8	4				5			9
		6	4	7	8			1
		1	3	2			5	4
		3			6			

గతవారం జవాబులు

6	7	8	4	1	9	2	3	5
9	1	2	3	5	6	4	7	8
4	3	5	7	8	2	1	9	6
1	8	3	6	4	5	9	2	7
7	4	9	1	2	8	5	6	3
2	5	6	9	3	7	8	4	1
3	2	4	5	6	1	7	8	9
5	6	7	8	9	4	3	1	2
8	9	1	2	7	3	6	5	4

1 ఫ	2 లా	లు	■	3 గ	ర	■	■	4 వే	5 ప
6 కీ	లు	■	7 బ	స్తీ	■	8 క	9 వ	యి	త్రి
రు	■	10 భు	జం	■	11 చి	వ	ర	■	■
■	12 ఉ	■	13 త్రి	14 ష	■	15 చం	ద	16 మా	17 మ
18 అ	■	19 నం	■	20 రా	21 ము	■	■	22 సం	హా
23 తి	24 మిం	గి	25 లం	■	26 ఖ	27 జా	నా	■	ప్ర
28 వా	గు	■	29 బ	30 క	ము	లు	■	31 నం	స్థా
■	■	32 రా	ము	ల	■	■	33 పా	ప	నం
34 సు	35 మ	తి	■	36 పి	37 త	38 లా	ట	కం	■
39 తా	ర	■	40 గా	■	41 మా	ట	లు	■	42 ది



యుద్ధం 'కన్న' బిడ్డలు

తీవ్ర యుద్ధ పరిస్థితుల్లో నలిగిపోతోన్న సిరియా చిన్నారులు 80 శాతం మంది.

ప్రమాదంలో పడిన 75 లక్షల మంది పసివారి జీవితాలు.

శరణార్థి శిబిరాల్లో ఉన్నది సుమారు 20 లక్షలు.

శరణార్థులుగా కనులు తెరిచింది సుమారు 50 వేల పైనే.

గత ఐదేళ్లలో 161 సార్లు రసాయన ఆయుధ దాడులు. 1491 మంది మృతి.. 14,581 మందికి తీవ్రగాయాలు.

కంచె దాటిన 46 లక్షల మంది.. చెదిరిపోయిన 76 లక్షల మంది సిరియన్లలో సగం మంది బాలలే.

ఎవర్ని కదిపినా యుద్ధ బీభత్సపు భయానక గుర్తులు. మాటల్లో చెప్పలేని హింస, దాడులు, అకృత్యాలు.

6 నెలలుగా ఉప్పు నీరు తప్ప ఏమీ లేక జీవచ్ఛవాలుగా మారిపోతున్న పసి ప్రాణాల కథనాలెన్నో.

12 వేలకు పైగా పసిబిడ్డలు యుద్ధానికి బలి.



- ప్రాణాంతక వ్యాధులు, ఆకలి, లైంగిక హింస, బాంబు దాడుల మధ్య బాల్యం.
- ప్రతి ముగ్గురిలో ఒకరికి యుద్ధం తప్ప మరేమీ తెలీదు.
- 5 ఏళ్ల లోపున్న ప్రతి చిన్నారికి యుద్ధమే జీవితం.
- అత్యవసరాలు దరిచేరని వారు సుమారు 2 లక్షలు.
- 14 ఏళ్ల తర్వాత మళ్లీ పోలియో కేసులు.
- శరణార్థి శిబిరాల్లో గర్భిణుల సంఖ్య సుమారు 84 వేలు.
- బడికి దూరమైనవారు 21 లక్షల మంది పైనే.
- కిరాయి సైన్యంగా, హ్యూమన్ షీల్డ్‌గా పసిమొగ్గలు.

(సోర్స్: సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్, యూనిసెఫ్, సేవ్ ది చిల్డ్రన్, మెర్సీ కార్ప్స్, వరల్డ్ విజన్)

పసిడి వన్నెల నేలలు

కొండ కోనల్లో పరుచుకున్న ఈ పసిడి తివాచీ చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లోని లువోపింగ్ ప్రాంతంలో ఉంది. కెనోలా అనే పూల సోయగాలతో ఇక్కడి క్షేత్రాలు బంగారాన్ని చిలకరించుకున్నట్టు తోస్తాయి. అవేనండి ఆవ నూనె తీసే సాసోలు. కంటికి కనిపించినంత మేర విస్తరించిన ఈ వ్యవసాయ భూములు ఫిబ్రవరి, మార్చి నుంచి జూన్ వరకు ఇలా స్వర్ణకాంతుల్ని వెదజల్లుతుంటాయి. ఆ సమయంలో ప్రత్యేక పర్యాటక బస్సులు నడిపి ఈ ప్రాంత పొలిమేరలకు చేరుస్తారు. అక్కడి నుంచి కాలి బాటనో, వీలైతే పిల్ల కాలువల్లో తెడ్డు పడవల్లోనో ఆ బంగారంలో మునిగిపోవచ్చు. ముదురు బూడిద రంగులో ఉండే కొండలు వెలుగులీనె పూల లోగిలి మధ్య ఠీవీగా నిలబడి చక్కని కాంట్రాస్ట్‌నిస్తాయి.